


సకల జీవులు శాంతిని కోరు కుంటాయని మీకు తెలుసు. శాంతి అనేది మనిషికి ఒక సహజమైన అవసరం; కానీ ప్రతికూల భావోద్వేగాలు, ప్రవృత్తులు, కోపం మరియు నిరాశలను ఎలా అధిగమించాలో వారికి తెలియదు. ప్రతికూలతను వదిలించుకోవడం, గతాన్ని విడిచి పెట్టడం మరియు భవిష్యత్తు వైపు సాగడం ప్రజలకు నేర్పించడానికి నేటి ప్రపంచంలో విద్య అవసరం.

- గురుదేవ్ శ్రీ శ్రీ రవి శంకర్ జీ


www.prajadeevena.com

# ప్రజా దీవెన

సమ సమాజ సంక్షేమం మా సంకల్పం...

నల్లగొండ | సంపుటి : 11 | సంచిక : 230 | సోమవారం | 22 జూన్ 2026 | పేజీలు : 04 వెల ₹5


## హోర్మోజ్‌లో హోరెత్తిన హెచ్చరికలు



ఇజ్రాయెల్ దాడులకు నిరసనగా జలసంధిని మూసేసిన ఇరాన్

ఇరాన్ చర్యను ధ్రువీకరించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్


దాడులు ఆపకపోతే ఇరాన్‌ను లేకుండా చేస్తామని హెచ్చరిక

హోర్ముజ్ జలసంధిలో తామే టోల్ వసూలు చేస్తామని ప్రకటన

ప్రపంచానికి మళ్లీ చమురు కష్టాలు?.. ట్రంపే కారణం: జర్మనీ

స్విట్జర్లాండ్‌లో చర్చలు.. ఇరాన్ వాకౌట్

06



## ప్రపంచశాంతికి ప్రయత్నంగా 'యోగ'

**అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ సందేశం..కోల్‌కతాలో యోగాసనాలు**

భూగోళంపై నిత్యం ఏదో ఒకచోట అశాంతి, ఘర్షణలు చెలరేగుతున్న ప్రస్తుత తరుణంలో యోగ సాధన ప్రపంచానికి శాంతిని చేకూర్చగలదని ప్రధాని మోదీ అన్నారు. పిల్లలు, పెద్దలు అన్న తేడా లేకుండా ప్రతి ఒక్కరూ యోగ సాధన చేయాలని పిలుపునిచ్చారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కోల్‌కతాలోని రెడ్‌రోడ్డు మైదానంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో మోదీ పాల్గొన్నారు.

## ఎస్బీఐతో ఎంతవరకైనా సర్కార్ సమరం

**ఎస్‌బీఐలో లావాదేవీల నిలిపివేత దిశగా సర్కారు అడుగులు**

కేంద్రం నుంచి వచ్చిన నిధులు కూడా విత్‌డ్రా..

ప్రస్తుతం రూ.5-6వేల కోట్లు ఉన్నట్లు అంచనా

కార్పొరేషన్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు సైతం వెనక్కి.. 'లీడ్ బ్యాంకు' హోదా కూడా తొలగింపు?

నేడు ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం.. ఢిల్లీ పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి

ఎస్‌బీఐ తీరును ప్రధానికి, ఆర్థిక మంత్రికి, ఆర్‌బీఐ గవర్నర్‌కు వివరించనున్న సీఎం

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నుంచి ప్రభుత్వానికి సంబంధించిన అన్ని లావాదేవీలనూ ఉపసంహరించుకునే యోచనలో ఉన్న సర్కారు.. ఈ దిశగా కసరత్తు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. రాయదుర్గంలోని సర్వే నంబరు 83/1లోని 5 ఎకరాల భూముల వేలం విషయంలో ఎస్‌బీఐ వ్యవహరించిన తీరు పట్ల ఆగ్రహంతోనే ప్రభుత్వం ఈ నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. అంతేకాకుండా.. పలు పథకాలు, ఇతరత్రా మ్యాచింగ్ గ్రాంట్ల కోసం కేంద్రం నుంచి వచ్చిన నిధులను కూడా ఎక్కువగా ఎస్‌బీఐలోనే పెడుతుండగా.. వాటిని కూడా వెంటనే విత్‌డ్రా చేసుకోవాలనే ఉద్దేశంతో ఉన్నట్టు తెలిసింది. మరోవైపు ప్రభుత్వ పరిధిలోని పలు కార్పొరేషన్‌లు, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలకు సంబంధించి వందల కోట్ల రూపాయల ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఎస్‌బీఐలో ఉన్నట్లు సర్కారు సేకరించిన ప్రాథమిక వివరాల్లో తేలిందని, వాటిని కూడా వడ్డీతో సహా బ్యాంకు నుంచి విత్‌డ్రా చేసుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. దీంతోపాటు

మిగతా 2 లో






## 'మూసీ'తో మహాత్ముని ఆత్మఘోష

మూసీలో కమీషన్ల కోసం వేలాది పేదల ఇండ్లు కూల్చుతున్న రేవంత్ సర్కార్

చోటే భాయ్-బడే భాయ్ కుట్ర.. కాంగ్రెస్ విధ్వంస రాజకీయాలకు బీజేపీ మద్దతు

గాడ్సేను నమ్మే రేవంత్.. మహాత్మా గాంధీ విగ్రహం పెడుతానంటూ దొంగ మాటలు

కాంగ్రెస్ సర్కార్‌కు గాంధీపై ప్రేముంటే పేదల ఇండ్లు విగ్రహం కట్టాలి

రాజేంద్రనగర్ నియోజకవర్గ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

03

గాంధీ మహాత్ముడి పేరుతో రేవంత్‌రెడ్డి చేస్తున్న మూసీ విధ్వంసాన్ని చూస్తే మహాత్ముడి ఆత్మ కూడా ఘోషిస్తుందని బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. కమీషన్లు, కాసుల కోసం వేలాది మంది పేద, మధ్యతరగతి ప్రజల ఇండ్లను కూల్చేందుకు రేవంత్‌రెడ్డి చేస్తున్న కుట్రను స్వయంగా మహాత్మాగాంధీ మనుమడు తుషార్ గాంధీ కూడా వ్యతిరేకించారని, అయినా వినకుండా పేదలపై సీఎం తన ప్రతాపం చూపుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు.




## ఉద్విగ్నభరితంగా నీట్

**బెంబేలెత్తించిన ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రశ్నలు**

కాస్త సులువుగా వృక్ష, జంతుశాస్త్రాలు

దేశవ్యాప్తంగా హాజరైన 20 లక్షల మంది

నిమిషం ఆలస్యమైనా అనుమతించని అధికారులు.. విద్యార్థుల కన్నీళ్లు

కాన్వాయ్‌తో అభ్యర్థులకు ఇబ్బందికావొద్దని 45నిమిషాలు ఢిల్లీ ఎయిర్‌పోర్టులోనే మోదీ

ఉద్విగ్నభరిత వాతావరణం మధ్య నీట్-2026 పునః పరీక్ష పూర్తయింది. దేశవ్యాప్తంగా 5,440 కేంద్రాలలో పరీక్ష కోసం 22.74 లక్షల మంది రిజిస్టర్ చేసుకోగా, 19.95 లక్షల మంది పరీక్ష రాసినట్టు ఎన్‌టీఏ తెలిపింది. పరీక్ష కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన అధికారులు.. నిర్ధారిత సమయం తర్వాత నిమిషం ఆలస్యంగా వచ్చినా అభ్యర్థులను పరీక్షకు అనుమతించలేదు.

04

## విషం చిమ్మిన వాయువు



గ్యాస్ లీకేజీతో ఏడుగురి మృత్యు వాత

రొయ్యల ప్రాసెసింగ్ కంపెనీలో అమ్మోనియా లీక్.. తీవ్ర అస్వస్థతకు గురైన సుమారు 60 మంది

చికిత్స పొందుతూ ఏడుగురు కార్మికులు మృతి..

తిరువళ్లూరు జిల్లాలో ఘటన

# ఎస్బీఐతో ఎంతవరకైనా సర్కార్ సమరం

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వంలో ఎస్‌బీఐకి ఉన్న 'లీడ్ బ్యాంకు' హోదానూ పక్కనపెట్టే అంశంపై సమాలోచనలు చేస్తున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ అంశాలన్నింటిపై సోమ, మంగళవారాల్లో తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని చెబుతున్నారు. ఆదివారం ఢిల్లీ పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. రాయదుర్గంలోని ఐదెకరాల భూముల విషయంలో ఎస్‌బీఐ వ్యవహరించిన తీరును సోమ, మంగళవారాల్లో ప్రధాని మోదీకి, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు, ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రాకు వివరించే అవకాశం ఉందని తెలిసింది.

## రూ.5-6వేల కోట్లు ఎస్‌బీఐలో!

రాష్ట్ర ప్రభుత్వం నిత్యం తన లావాదేవీలను ఎక్కువగా ఎస్‌బీఐ నుంచే నిర్వహిస్తోంది. రాష్ట్ర స్థాయి నుంచి మండల స్థాయి వరకు ఉన్న ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఈ బ్యాంకుతోనే తమ లావాదేవీలు కొనసాగిస్తున్నాయి. మరోవైపు ఉద్యోగుల జీతాలు, పీఎఫ్‌లు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, ఫిక్స్‌డ్ డిపాజిట్‌లు, కార్పొరేషన్లు, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు సహా ఇతరత్రా లావాదేవీలు కూడా ఈ బ్యాంకు నుంచే జరుగుతున్నాయి. దీంతో ప్రతి రోజూ, నెల వారీగా చూస్తే రూ.వేల కోట్లలో ప్రభుత్వం.. ఎస్‌బీఐతో లావాదేవీలు జరుపుతోంది. ఈ నేపథ్యంలోనే ఆ లావాదేవీలను నిలిపివేయడంతోపాటు ప్రభుత్వ సంస్థలకు ఉన్న ఫిక్స్‌డ్ డిపాజిట్‌లను కూడా ఉపసంహరించుకోవాలని సర్కారు భావిస్తున్నట్టు తెలిసింది. శనివారం రాత్రి వరకు అన్ని శాఖల నుంచి అందిన ఎస్‌బీఐ లావాదేవీల ప్రకారం.. వివిధ స్కీమ్‌లు, మ్యాచింగ్ గ్రాంట్ల కింద రాష్ట్రానికి దాదాపు రూ.5-6 వేల కోట్ల వరకు వచ్చినట్లు సమాచారం. ఈ నిధులన్నీ ప్రస్తుతం ఎస్‌బీఐలోనే ఉన్నట్లు, వాటన్నింటినీ విత్ డ్రా చేసుకుని వేరే బ్యాంకులోకి బదిలీ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్టు తెలిసింది.

## కార్పొరేషన్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఎస్‌బీఐలోనే అధికం..

రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన కొన్ని కార్పొరేషన్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు కూడా ఎస్‌బీఐలోనే ఎక్కువగా ఉన్నాయి. ప్రభుత్వం సేకరించిన వివరాల ప్రకారం రోడ్ డెవల్‌పమెంట్ కార్పొరేషన్ (ఆర్‌డీసీ) పరిధిలో సుమారు రూ.75 కోట్లు, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్)కి సంబంధించి రూ.80 కోట్లకు పైగా ఫిక్స్‌డ్ డిపాజిట్లు, మరో సంస్థ పరిధిలో సుమారు రూ.300 కోట్ల లావాదేవీలు ఎస్‌బీఐలో ఉన్నట్టు తేలింది. ఇలా అన్ని ప్రభుత్వ శాఖలు, సంస్థలు, యూనివర్సిటీల లావాదేవీలన్నీ కోట్లలోనే ఉన్నాయని సమాచారం. వీటన్నింటి నుంచి వైదొలగాలని ప్రభుత్వం యోచిస్తోందని, దీనిపై త్వరలోనే ఒక నిర్ణయం తీసుకోనుందని సమాచారం. కార్పొరేషన్ల ఫిక్స్‌డ్ డిపాజిట్‌లను వేరే బ్యాంకుకు బదిలీ చేసేందుకు ఉన్న



మార్గాలపై కసరత్తు చేస్తున్నట్టు తెలిసింది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వంలో ప్రస్తుతం ఎస్‌బీఐకి ఉన్న 'లీడ్ బ్యాంకు' హోదా నుంచి కూడా తొలగించేందుకు ఉన్న అవకాశాలపైనా ప్రభుత్వం సమాలోచనలు చేస్తున్నట్టు సమాచారం.

## ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీకి చేరుకున్నారు. ఆదివారం సాయంత్రం ముంబయి నుంచి ఢిల్లీకి చేరుకున్న సీఎం నేరుగా తుగ్లక్‌రోడ్‌లోని తన నివాసానికి చేరకున్నారు. సోమ, మంగళవారాల్లో ఢిల్లీలోనే ఉండనున్న ముఖ్యమంత్రి.. ఈ సందర్భగా పలువురు కేంద్రమంత్రులతో భేటీ కానున్నారు. కేంద్ర రసాయన, ఎరువుల మంత్రి జేపీ నడ్డా, రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను సీఎం రేవంత్ కలిసే అవకాశాలున్నాయని అధికార వర్గాలు తెలిపాయి. ఖరీఫ్ సీజన్ రావడంతో రాష్ట్ర రైతులకు ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకోవడంపై జేపీ నడ్డాకు, ఇటీవల రాష్ట్ర ప్రాజెక్టులపై కేంద్ర రక్షణ శాఖ అనుమతివ్వడంతో రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతారని ఆ వర్గాలు తెలిపాయి.

# టిమ్స్‌లో డబుల్ స్పెషాలిటీ

**ఒక్కోచోట రెండేసి చొప్పున స్పెషాలిటీ వైద్య సేవలు..**
**సనత్‌నగర్ టిమ్స్‌కు అదనంగా మరో 200 కోట్లు**
**మల్టీలెవల్ పార్కింగ్, పీజీ హాస్టల్, క్యాంటీన్ నిర్మాణం**
**అంతర్జాతీయ రోగులకు ప్రతి టిమ్స్‌లో 100 పడకలు**
**నిమ్స్ తరహాలో యూజర్ చార్జీల వసూలు**

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(టిమ్స్)కు సంబంధించి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఒక్కో టిమ్స్ ఆస్పత్రిలో ఒక్కో సూపర్ స్పెషాలిటీ సేవలతో పాటు దానికి అనుబంధంగా ఉండేలా మరో స్పెషాలిటీ వైద్య సేవలను ప్రవేశపెట్టనుంది. సనత్‌నగర్ టిమ్స్ ఆస్పత్రి కోసం మరో రూ.200 కోట్లు అదనంగా కేటాయించనుంది. పాత ప్లానింగ్‌లో కొన్ని లోపాలున్నాయని గుర్తించి, వాటిని సరిదిద్దే ప్రక్రియలో భాగంగా మరికొన్ని నిర్మాణాలు చేపట్టాల్సిన అవసరం ఉందని అధికారులు గుర్తించారు. వీటికి అదనంగా మరో రూ.200 కోట్లు అవుతాయని అధికారులు అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందించారు.




## రెండేసి చొప్పున స్పెషాలిటీ వైద్య సేవలు

ప్రస్తుతం నగరంలో ప్రభుత్వం మూడు టిమ్స్ ఆస్పత్రులను నిర్మిస్తోంది. సనత్‌నగర్ టిమ్స్‌ను సుమారు రూ.882 కోట్లతో 22.6 ఎకరాల విస్తీర్ణంలో 111.68 లక్షల చదరపు అడుగుల్లో కడుతున్నారు. అత్యంత అధునాతనమైన 16 స్పెషాలిటీలు, 15 సూపర్ స్పెషాలిటీల విభాగాలు అందుబాటులో ఉంటాయి. ఒక్కో టిమ్స్ ఆస్పత్రి ఒక్కో ప్రత్యేక వైద్య విభాగానికి సెంటరాఫ్ ఎక్సలెన్స్‌గా సేవలందించనుంది. సనత్‌నగర్ టిమ్స్‌ను కార్డియాక్ కేర్ అండ్ ట్రాన్స్‌ప్లాంట్ సైన్సెస్, కార్డియోథొరాసిక్ కోసం వినియోగించనున్నారు. గుండె జబ్బులకు అనుసంధానంగా ఉండే మరో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను కూడా ఇక్కడ ప్రారంభించాలని సర్కారు భావిస్తోంది. ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసి లివర్, కిడ్నీ మార్పిడి సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు. అలాగే డయాలసిస్ యూనిట్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నారు. సనత్‌నగర్ టిమ్స్‌లో అదనపు సౌకర్యాల కోసం మరో రూ.200 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇందులో 700-1000 కార్లు పార్కింగ్ చేసేలా మల్టీలెవల్ పార్కింగ్, పీజీ హాస్టల్, క్యాంటీన్, సుమారు వందకుపైగా టాయిలెట్స్(పేషంట్ అటెండర్స్ కోసం) నిర్మించబోతున్నారు. అల్వాల్ టిమ్స్‌ను సుమారు రూ.897 కోట్లతో 11.53 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు. ఇక్కడ ట్రామాకేర్, నూర్యాలజీ, న్యూరోసైనట్ససకు అనుబంధంగా స్పెషాలిటీ వైద్య సేవలను ఏర్పాటు చేయాలని సర్కారు భావిస్తోంది. ఎల్బీనగర్ టిమ్స్‌ను సుమారు రూ.900 కోట్లతో 13.71 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కడుతున్నారు. ఇక్కడ గ్యాస్ట్రో సైన్సెస్ సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలకు అదనంగా పిడియాట్రిక్ సెంటరాఫ్ ఎక్సలెన్సీని అందుబాటులోకి తీసుకురావాలని సర్కారు భావిస్తోంది. దాంతో నీలోఫర్‌పై భారం బాగా తగ్గుతుందని అంచనా వేస్తోంది.

## పడకల విభజన ఇలా

ఒక్కో టిమ్స్ ఆస్పత్రిలో వేయి పడకలుంటాయి. వీటిలో సుమారు 100 వరకు అంతర్జాతీయ రోగుల కోసం కేటాయించనున్నారు. మరో 300 పడకలు ఐసీయూ బెడ్స్ ఉంటాయి. మరో 300 పడకలు జనరల్ పబ్లిక్, ఆరోగ్యశ్రీ కోసం కేటాయించనున్నారు. ఇంకో 40 పడకలు డయాలసిస్ యూనిట్స్ కోసం కేటాయించనున్నారు. మరో 200 బెడ్స్ పూర్తిగా పెయిడ్ సర్వీసెస్ కోసం కేటాయిస్తున్నారు. ప్రైవేటు కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యసేవల కోసం లక్షలాది రూపాయలు వెచ్చించలేని వారి కోసం ఈ బెడ్స్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువస్తోంది. ఇక నిమ్స్ తరహాలోనే యూజర్ చార్జీలను మూడు టిమ్స్‌లలో వసూలు చేయనున్నారు. సెల్ఫ్ ఆటానమస్ సంస్థలు కావడంతో వీటికివే ఆదాయం జనరేట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతానికి నిమ్స్‌లో ఉండే యూజర్ చార్జీలనే ఇక్కడ కూడా వసూలు చేయనున్నారు.

# పిల్లలను చంపి.. తల్లి ఆత్మహత్యాయత్నం!

**మద్యం, బెట్టింగ్‌కు బానిసైన భర్త...**
**లక్షల్లో డబ్బు పోగొట్టిన వైనం**
**ఇద్దరు పిల్లలకు ఎలుకల మందు**
**తినిపించి.. తాను తిన్న తల్లి ఆమె పరిస్థితి విషమం**

**ప్రజా దీవెన, ఖమ్మం క్రైం :** మద్యం, బెట్టింగ్‌కు బానిసైన భర్త తీరుతో తీవ్ర మనస్తాపం చెందిన భార్య.. ఇద్దరు పిల్లలకు ఎలుకల మందు తినిపించి.., తాను తీసుకుంది. ఇద్దరు పిల్లలు ప్రాణాలు కోల్పోగా, ఆమె పరిస్థితి విషమంగా ఉంది. ఖమ్మం జిల్లా కేంద్రంలో ఈ ఘటన జరిగింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మునిసిపాలిటీలోని గుర్రాలపాడు ప్రాంతానికి చెందిన బోబ్బాల లింగరాజుకు చింతకాని మండలం నరసింహపురం గ్రామానికి చెందిన దొడ్డా పూర్ణయ్య కుమార్తె స్వాతితో 2020లో వివాహం జరిగింది. వీరికి కుమారులు వేదిక్ కుమార్ (5), తనీశ్ కుమార్(4) ఉన్నారు. లింగరాజు భార్యతో కలిసి గుర్రాలపాడులోనే ఉంటూ ఖమ్మంలోని ఓ సెల్‌పాయింట్‌లో పని చేస్తున్నాడు. ఏడాది క్రితం భార్యాపిల్లలతో ఖమ్మంలోని గాంధీనగర్‌లోని ఓ అద్దె ఇంటికి మారాడు. ఈ క్రమంలో లింగరాజు మద్యానికి బానిసయ్యాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకూ అలవాటు పడి రూ.లక్షల్లో పోగొట్టుకున్నాడు. గమనించిన మామ పూర్ణయ్య ఇటీవలే లింగరాజుకు ఇకనైనా దురలవాట్లు మానుకోవాలని చెప్పి రూ.1.5 లక్షలు ఇచ్చాడు. ఆ డబ్బులనూ లింగరాజు బెట్ కాసి పోగొట్టుకున్నాడు. ఇలా బెట్టింగ్‌లో మొత్తంగా రూ. 4లక్షల దాకా పోగొట్టుకున్నాడు. ఈ విషయం ఇరు కుటుంబాలకు తెలియడంతో వారు భార్యాభర్తలను కూర్చోబెట్టి సొంతూరుకు వెళ్ళి ఏదైనా పనిచేసుకొవాలని సూచించారు. దీంతో లింగరాజు గుర్రాలపాడుకు వెళ్లి ఏదైనా చేసుకోవాలని నిర్ణయం తీసుకున్నాడు. శనివారం ఉదయం ఖమ్మంలోని అద్దె ఇంట్లోని సామాను సర్దుకునేందుకు ఏర్పాట్లు కూడా చేసుకున్నాడు. తీవ్ర ఆర్థిక సమస్యల కారణంగా ఖమ్మం వదిలి, గ్రామానికి వెళ్లడం స్వాతికి నచ్చలేదు. ఈ విషయమై ఇద్దరి మధ్య రెండు రోజుల క్రితం పెద్ద ఎత్తున గొడవ కూడా జరిగింది. స్వాతి తండ్రి శనివారం ఖమ్మానికి వచ్చి సొంతూరుకే వెళ్లాలని ఆమెకు నచ్చజెప్పి వెళ్లాడు. ఆ తర్వాత కొద్దిసేపటికే ఇంట్లో ఎవరూ లేని సమయంలో స్వాతి తన ఇద్దరు పిల్లలకు బిస్కెట్లలో ఎలుకల మందు పెట్టి తినిపించింది. ఆ తర్వాత తాను కూడా తిన్నది. కొద్దిసేపటికి భర్త లింగరాజుకు ఫోన్ చేసి పిల్లలకు ఫుడ్‌పాయిజన్ అయిందని, వాంతులు అవుతున్నాయని.. వెంటనే మందులు తీసుకు రావాలని చెప్పింది. లింగరాజు ఓ మెడికల్ షాపులో సిరప్ తీసుకుని ఇంటికి వెళ్లి ఇచ్చాడు. ఆదివారం తెల్లవారుజామున పెద్ద కుమారుడు వేదిక్ కుమార్ తీవ్ర అస్వస్థతకు గురవడంతో చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే తనీశ్‌కు కూడా వాంతులు కావడంతో.. అతన్ని కూడా ఆస్పత్రిలో చేర్పించారు. అనుమానం వచ్చిన భర్త, అతడి కుటుంబ సభ్యులు అసలు ఏం జరిగిందని స్వాతిని నిలదీశారు. దీంతో ఇద్దరు పిల్లలకు బిస్కెట్‌లలో ఎలుకల మందు తినిపించి, తాను కూడా తిన్నట్టు తెలిపింది. వెంటనే ఆమెను కూడా భర్త ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించాడు. వేదిక్, తనీశ్ ఇద్దరూ చికిత్స పొందుతూ మృతిచెందారు. స్వాతి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిసింది. భర్త బెట్టింగ్‌లకు అలవాటు పడి, ఆర్థికంగా తీవ్ర నష్టపోవడం వల్లే స్వాతి ఈ దుశ్చర్యకు పాల్పడినట్టు తెలుస్తోంది. కాగా.. బెట్టింగులకు అలవాటుపడి లింగరాజు వేధిస్తుండటం వల్లే మనస్థాపం చెంది తన కూతురు స్వాతి ఈ ఘటనకు పాల్పడిందని ఆమె తండ్రి పూర్ణయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఖమ్మం పోలీసులు ఘటనపై కేసు నమోదు చేశారు.

# ఉద్విగ్నభరితంగా నీట్

## బెంబేలెత్తించిన ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రశ్నలు.. కాస్త సులువుగా వృక్ష, జంతుశాస్త్రాలు

**న్యూఢిల్లీ :** ఉద్విగ్నభరిత వాతావరణం మధ్య నీట్-2026 పునః పరీక్ష పూర్తయింది. దేశవ్యాప్తంగా 5,440 కేంద్రాలలో పరీక్ష కోసం 22.74 లక్షల మంది రిజిస్టర్ చేసుకోగా, 19.95 లక్షల మంది పరీక్ష రాసినట్టు ఎన్‌టీఏ తెలిపింది. తెలంగాణలోని 208 పరీక్ష కేంద్రాల్లో పరీక్ష కోసం 73,059 మంది రిజిస్టర్ చేసుకోగా, 65,087 మంది (89.09 శాతం) హాజరయ్యారు. పరీక్ష కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన అధికారులు.. నిర్ధారిత సమయం తర్వాత నిమిషం ఆలస్యంగా వచ్చినా అభ్యర్థులను పరీక్షకు అనుమతించలేదు. గూగుల్ మ్యాప్స్‌లో లొకేషన్ తప్పుగా చూపించడం, ట్రాఫిక్ జామ్‌లు, హాల్‌టికెట్లలో పేర్కొన్న వివరాల్లో గందరగోళం వంటి కారణాలతో వేలాది మంది అభ్యర్థులు సమయానికల్లా పరీక్షా కేంద్రాలకు చేరుకోలేకపోయారు. ఆలస్యంగా వచ్చినవారిని లోనికి అనుమతించకపోవడంతో పలుచోట్ల అభ్యర్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. బతిమాలారు. చివరికి కన్నీళ్లతో వెనుదిరిగారు. మరోవైపు నీట్ పరీక్ష రాసి బయటికి వచ్చిన విద్యార్థుల్లోనూ కొంత ఆందోళన కనిపించింది. పరీక్షలు సుదీర్ఘంగా, కఠినంగా వచ్చాయని అభ్యర్థులు పేర్కొన్నారు. రద్దయిన నీట్‌ను చాలా బాగా రాశామని, కానీ ఇప్పుడు కఠినంగా రావడం ఆందోళన కలిగిస్తోందని వాపోయారు.

## అత్యంత పకడ్బందీగా ఏర్పాట్లు..

మే 3 జరిగిన నీట్ పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రాలు లీకైన నేపథ్యంలో అదే నెల 12న పరీక్షను రద్దు చేస్తున్నట్టు ఎన్‌టీఏ ప్రకటించింది. తిరిగి ఆదివారం (ఈ నెల 21న) మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు పరీక్షను తిరిగి నిర్వహించింది. పరీక్ష లీకేజీతో విద్యార్థుల్లో నెలకొన్న ఆందోళన, మళ్లీ అలాంటి ఘటన జరిగితే ఎలాగన్న సందేహాల నేపథ్యంలో.. నీట్ పునః పరీక్షకు కేంద్ర ప్రభుత్వం అత్యంత పకడ్బందీగా ఏర్పాట్లు చేసింది. దేశవ్యాప్తంగా 551 పట్టణాల్లోని 5,440 సెంటర్ల వద్ద గట్టి భద్రత కల్పించింది. పరీక్షలు జరిగిన సుమారు 95 వేల గదులు, పరీక్షా కేంద్రం ఆవరణల్లో కలిపి మొత్తంగా 1.38 లక్షల సీసీ కెమెరాలు, 51,311 సిగ్నల్ జామర్లను ఏర్పాటు చేసింది. పరీక్ష జరుగుతున్న తీరును కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఢిల్లీలోని ఓఖ్లా ప్రాంతంలో ఉన్న ఎన్‌టీఏ ప్రధాన కార్యాలయం నుంచి పర్యవేక్షించారు. గుజరాత్‌లో నీట్ పరీక్షా కేంద్రాల వద్ద డ్రోన్లతో నిఘా పెట్టారు. నీట్ పునః పరీక్ష నిర్వహణ కోసం ప్రభుత్వంలోని అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేశాయని.. అధికారులు, సిబ్బంది, పోలీసులు కలిపి సుమారు 7 లక్షల మంది విధులు నిర్వర్తించారని ఎన్‌టీఏ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్ తెలిపారు.



# ‘మూసీ’తో మహాత్ముని ఆత్మఘోష

మూసీలో కమీషన్ల కోసం వేలాది పేదల ఇండ్లు కూల్చుతున్న రేవంత్ సర్కార్

చోటే భాయ్-బడే భాయ్ కుట్ర.. కాంగ్రెస్ విధ్వంస రాజకీయాలకు బీజేపీ మద్దతు

గాడ్సేను నమ్మే రేవంత్.. మహాత్మా గాంధీ విగ్రహం పెడుతాననంటూ దొంగ మాటలు

కాంగ్రెస్ సర్కార్‌కు గాంధీపై ప్రేముంటే పేదల ఇండ్లు విగ్రహం కట్టాలి

రాజేంద్రనగర్ నియోజకవర్గ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**ప్రజా దీవెన, హైదరాబాద్ :** గాంధీ మహాత్ముడి పేరుతో రేవంత్‌రెడ్డి చేస్తున్న మూసీ విధ్వంసాన్ని చూస్తే మహాత్ముడి ఆత్మ కూడా ఘోషిస్తుందని బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. కమీషన్లు, కాసుల కోసం వేలాది మంది పేద, మధ్యతరగతి ప్రజల ఇండ్లను కూల్చేందుకు రేవంత్‌రెడ్డి చేస్తున్న కుట్రను స్వయంగా మహాత్మాగాంధీ మనుమడు తుషార్ గాంధీ కూడా వ్యతిరేకించారని, అయినా వినకుండా పేదలపై సీఎం తన ప్రతాపం చూపుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. రేవంత్‌రెడ్డి నమ్మేది గాడ్సేను అయినా మహాత్మా గాంధీ విగ్రహం పెడుతానని దొంగ మాటలు చెప్తున్నారని మండిపడ్డారు. గాంధీపై నిజంగా రేవంత్‌కు ప్రేమ ఉంటే పేదల ఇండ్లు కూల్చకుండా మహాత్ముడి విగ్రహం పెట్టాలని సూచించారు. ‘చివరికి పిల్లలు సైతం తమ ఇండ్లు కూలగొట్టవద్దు.. కిడ్డీ బ్యాంక్ డబ్బులైనా ఇస్తాం.. మమ్మల్ని వదిలిపెట్టండి’ అని వేడుకున్నా మనసు కరగని దుర్మార్గపు పాలన కొనసాగుతున్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం శంషాబాద్ జేడీ కన్వెన్షన్‌లో రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.

### చోటే భాయ్-బడే భాయ్‌లు కలిసి ప్రజలకు మోసం..

మూసీ పేరుతో కాంగ్రెస్ చేస్తున్న విధ్వంస రాజకీయాలకు బీజేపీ కూడా మద్దతు ఇస్తున్నదని కేటీఆర్ ఆరోపించారు. చోటే భాయ్.. బడే భాయ్ ఇద్దరూ కలిసి మూసీ భూములు కూలగొడుతున్నారని విమర్శించారు. నిజంగానే మోదీకి నిజాయితీ ఉంటే పేదల భూములు లాకోవద్దని, పేదలకు అన్యాయం చేయవద్దని ఎందుకు ప్రశ్నించరు అని నిలదీశారు. ఒకవైపు స్థానికంగా మూసీ ప్రజలను మోసం చేస్తున్నారని స్థానిక బీజేపీ నేతలు ఈటల రాజేందర్, కిషన్‌రెడ్డి మాట్లాడుతుంటే.. కేంద్రంలోని ఉన్న బీజేపీ ప్రభుత్వం మాత్రం ఇండ్లు కూలగొట్టమని అనుమతులు ఇస్తుందని కేటీఆర్ మండిపడ్డారు. రెండున్నరేండ్లు దాటినా ఒక హామీ కూడా నెరవేర్చేందుకు డబ్బులు లేవని చెబుతున్న రేవంత్‌రెడ్డి.. మూసీ కోసం మాత్రం లక్షన్నర కోట్ల ఖర్చు పెట్టేందుకు సిద్ధమవుతున్నారని దుయ్యబట్టారు. కేవలం రాహుల్‌గాంధీకి ప్రతినెలా కమీషన్లు పంపేందుకే రేవంత్‌రెడ్డి ఇన్ని అరాచకాలు చేస్తున్నారని, డబ్బు కట్టలు పంపి రెన్యువల్ చేసుకోకుంటే ముఖ్యమంత్రి పదవి పోతుందని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

### ‘రేవంత్‌రెడ్డి సినిమా’తో 4కోట్ల మందికి నష్టం

ఒక సినిమా ఫెయిల్ అయితే ప్రొడ్యూసర్లకు నష్టం వస్తుందని, కానీ ఇప్పుడు నడుస్తున్న రేవంత్‌రెడ్డి అనే సినిమాతో 4కోట్ల తెలంగాణ ప్రజలకు నష్టం వస్తుందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఇప్పటికే కాంగ్రెస్ సినిమా సగం అయిపోయిందని అది పూర్తి అట్టర్‌ఫ్లాప్ సినిమా అని ఎద్దేవా చేశారు. ‘అది డిజాస్టర్ అని అందరికీ తెలిసిపోయింది.. ఇంటర్వెల్ అయిపోగానే ఎప్పుడు పోతడు రా రేవంత్‌రెడ్డి అని అందరూ తలపట్టుకొని కూర్చున్నరు’ అంటూ సెటైర్ వేశారు. మూసీలో ఖర్చు పెడుతున్న రూ.లక్షన్నర కోట్లతో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేసే ప్రయత్నం చేయాలని కేటీఆర్ సూచించారు. కాంగ్రెస్ పోవాలి.. కేసీఆర్ రావాలనే ఏకైక ఆలోచన ప్రజల్లో ఉన్నదని కేటీఆర్ తెలిపారు.

### దోచుకో..దాచుకో అన్నట్టు ప్రభుత్వం తీరు

రాష్ట్రంలో ప్రభుత్వం లేదని కేవలం ఒక మాఫియా రాజ్యం నడుస్తున్నదని కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దండుపాళ్యం ముఠాకు నాయకుడిలా రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తుంటే.. ఆయన ఆధ్వర్యంలో దోచుకో.. దాచుకో అన్నట్టుగా మంత్రులంతా కలిసి స్కామ్‌లు చేస్తున్నారని విమర్శించారు. సామాన్యుల భూములు లాకొని గూండాయిజం చేసే రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కొడుకు గూండాయిజాన్ని ప్రతి ఒకరూ చూశారని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ కనుసన్నల్లోనే శంషాబాద్‌లో 180 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు రాసిచ్చిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. రెండున్నరేండ్లుగా హైదరాబాద్‌లో ఒక ఇల్లు కూడా కట్టని కాంగ్రెస్ ప్రభుత్వం.. వేలాది ఇండ్లను కూల్చేందుకు మాత్రం సిద్ధమవుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఉన్న సిటీని వదిలిపెట్టి కేవలం తాను కబ్జా చేసిన వేలాది ఎకరాలను కాపాడుకునేందుకే ఫ్యూచర్ సిటీ పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు.

### రాజేంద్రనగర్ ప్రజలకు ప్రకాశ్‌గౌడ్ ద్రోహం

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌పై కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అభివృద్ధి పేరుతో పార్టీ మారితే ఈ రెండున్నరేండ్లలో చేసిన ఒక్క అభివృద్ధి పని అయినా చెప్పగలరా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ రాజేంద్రనగర్ ప్రజలకు ద్రోహం చేశాడని విరుచుకుపడ్డారు. ఎమ్మెల్యే పోయినా బీఆర్ఎస్ పార్టీకి ఎలాంటి ఢోకా లేదని, రాజేంద్రనగర్‌లో పార్టీ బాధ్యతలు కార్తిక్‌రెడ్డి భుజాల మీద ఉన్నదని కేటీఆర్ చెప్పారు. రానున్న ఎన్నికల్లో కేసీఆర్‌ని తిరిగి ముఖ్యమంత్రిగా చేసి గులాబీ జెండా ఎగురవేయడం ఖాయమని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వ నమోదుతో పాటు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్)పై కార్యకర్తలకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

---

## రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ ఇప్పించండి

### 6గ్యారంటీలు ఎప్పుడు నెరవేరుస్తారని అడగాలి

### సీఎం రేవంత్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు బహిరంగ లేఖ



**ప్రజా దీవెన, హైదరాబాద్ :** కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా.. నేటికీ ఆరు గ్యారంటీలను నెరవేర్చలేక పోయిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రారచందర్‌రావు విమర్శించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి హామీల అమలులో వైఫల్యాన్ని వివరిస్తూ వినతిపత్రం ఇచ్చేందుకు.. అపాయింట్‌మెంట్ ఇప్పించాలని సీఎం రేవంత్‌ను రారచందర్‌రావు కోరారు. ఈ మేరకు ఆదివారం సీఎంకు ఆయన బహిరంగ లేఖ రాశారు. రాజ్యాంగ విలువలు, హామీల అమలుపై పదేపదే పేర్కొనే రాహుల్‌కు తెలంగాణ ప్రజల మనోభావాలను వివరించాల్సి ఉందన్నారు. విదేశీ పర్యటనలతో బిజీగా ఉన్న రాహుల్ వారికిచ్చిన హామీలను మరచిపోయి ఉంటారని రాంచందర్‌రావు ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌కు కాంగ్రెస్ అగ్రనాయకత్వం వద్ద ‘ప్రత్యేక స్థానం’ ఉందని.. ఆయన రాహుల్‌తో అపాయింట్‌మెంట్ ఇప్పించగలరనే విశ్వాసం తనకు ఉందన్నారు. తన లేఖకు స్పందించకపోయినా, రాహుల్ అపాయింట్‌మెంట్ ఇప్పించకపోయినా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకు చేసిన ద్రోహమే అవుతుంద న్నారు. ‘గత ఎన్నికల ముందు రాష్ట్రంలో ప్రచారం చేసిన సోనియా, రాహుల్, ప్రియాంక వ్యక్తిగతంగా ఇచ్చిన హామీ మేరకే ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేశారు. మహిళలకు ప్రతినెలా రూ.2,500 సాయం నేటికీ అందలేదు. ఎకరాకు రూ.15వేల రైతు భరోసా, క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లింపు, మద్దతు ధరకు పంటల కొనుగోలులో కాంగ్రెస్ విఫలమైంది. విద్యాభరోసా కింద రూ.5లక్షల సాయం, నిరుద్యోగులకు రూ.4వేల భృతి, వృద్ధులకు రూ.4వేల పింఛన్ ఇప్పటికీ అందలేదు. ఈ నేపథ్యంలో ఈఅంశాలను మీ పార్టీ అగ్రనేత రాహుల్‌కు గుర్తుచేస్తాం. ఆయనతో జరిగే భేటీలో మీరు కూడా పాల్గొన్నా అభ్యంతరం లేదు’అని లేఖలో రాంచందర్‌రావు వివరించారు.

## క్రమశిక్షణ చర్యల కమిటీ ముందు హాజరైన షబ్బీర్

### తన మీద వచ్చిన ఫిర్యాదులపై వివరణ

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** కామారెడ్డి కాంగ్రెస్ నేతల వివాదానికి సంబంధించి తన మీద వచ్చిన ఫిర్యాదు, ఆరోపణలపై వివరణ ఇచ్చేందుకు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ.. ఆదివారం గాంధీభవన్‌లో టీపీసీసీ క్రమశిక్షణ చర్యల కమిటీ ముందు హాజరయ్యారు. పార్టీ వర్గాల్లో కలకలం రేపిన వివాదాస్పద ఆడియో టేపుల్లో వాయిస్ తనది కాదని, తనను రాజకీయంగా ఇబ్బంది పెట్టడానికి, తన ప్రతిష్ఠను దిగజార్చడానికి కొందరు ప్రత్యర్థులు కుట్రపూరితంగా ఈ ఆడియో టేపుల్ని సృష్టించి, వైరల్ చేశారని వివరణ ఇచ్చారు. షబ్బీర్ అలీపైన ఫిర్యాదు చేసిన కామారెడ్డి నేత చంద్రశేఖర్‌రెడ్డి కూడా కమిటీ ముందు హాజరయ్యారు. ఇద్దరితో సుదీర్ఘంగా చర్చించిన కమిటీ.. వారి మధ్య సంధి కుదిర్చినట్లు తెలుస్తోంది. పరస్పరం చేతులు కలిపిన నేతలు.. పార్టీ కోసం కలిసే పనిచేసిందుకు అంగీకరించినట్లు సమాచారం.

## జాతీయ రహదారిపై భారీ దోపిడి, రూ.4.50 కోట్ల విలు వైన బంగారం చోరీ

**ప్రజా దీవెన,నంద్యాల:** డోన్ జాతీ య రహదారిపై గల భారత్ స్మార్ట్ డాబా దగ్గర ఒక భారీ టెక్–దోపిడీ జరిగింది. అనంతపురం నుంచి బ యలుదేరిన ఒక అధునాతన ప్రై వేట్ ట్రావెల్స్ బస్సును, అత్యాధు నిక ట్రాకింగ్ డివైజ్‌లతో ఫాలో చేసి న కొందరు గుర్తుతెలియని హైజా కర్లు.. రూ. 4.50 కోట్ల విలువైన 2. 750 కేజీల “సూపర్ కండక్టివ్ గోల్డ్” (స్మార్ట్ గోల్డ్)ను క్షణాల్లో మాయం చేశారు. అనంతపురం నుంచే బా ధితుడు మోతిలాల్ ప్రయాణిస్తు న్న బస్సును ఒక హై–స్పీడ్ స్కా ర్పి యో కారు నీడలా వెంటాడింది. బ స్సులోని లగేజ్ కంపార్ట్‌మెంట్‌ను స్కాన్ చేయడానికి దొంగలు ప్రత్యే క సిగ్నల్ డిటెక్టర్లను వాడినట్లు తె లుస్తోంది.్‌ోన్ హైవేలోని భారత్ డాబా దగ్గర బస్సు ఆగింది. ప్రయాణికులు, డ్రై వర్లు ఆటోమేటెడ్ ఫుడ్ కోర్టులో ఉ న్న గ్యాప్‌ను క్యాష్ చేసుకున్న దొం గలు.. బస్సు సెక్యూరిటీ అలార మ్‌లను డీయాక్టివేట్ చేసి, బంగా రం ఉన్న బయో–లాక్ బ్యాగ్‌ను అ పహరించారు.

### జడ్చర్ల చేరాక గానీ అలర్ట్ కాలే

బస్సు డోన్ నుంచి బయలుదేరి ‘జ డ్చర్ల’ టెర్మినల్ చేరుకున్నాక కానీ బాధితుడు మోతిలాల్‌కు అసలు విషయం అర్థం కాలేదు. తన సీట్ కింద ఉండాల్సిన డిజిటల్ గోల్డ్ బ్యాగ్ మాయమవ్వడం చూసి ఆ యన షాక్‌కు గురయ్యారు. అప్ప టికే దొంగలు సిగ్నల్ జామర్లను వా డటంతో బ్యాగ్‌లోని జీపీఎస్ ట్రాక ర్ కూడా ఆఫ్ అయిపోయింది. బాధితుడి ఫిర్యాదుతో డోన్ పో లీ స్ నెట్‌వర్క్ రంగంలోకి దిగింది. భారత్ డాబా దగ్గరున్న ‘హై–డె ఫి నిషన్–ూ× సీసీటీవీ’ ఫుటేజ్‌లను, స్కార్పియో వెళ్లిన రూట్ లోని స్మా ర్ట్ గ్రిడ్ కెమెరాలను పోలీసులు విశ్లే షిస్తున్నారు. దొంగల కోసం స్పెషల్ సైబర్–క్రైమ్ స్క్వాడ్‌లు గాలిస్తు న్నాయి.

## మీనమేషాల్లో ‘మీనాక్షి’

అది నామినేషన్ తిరస్కరణకు ఒక రోజు ముందు బీజేపీ పుట్టించిన వదంతి

ఎన్నికల రిటర్నింగ్ అధికారితో ఆ పార్టీ కుమ్మక్కు

నా కోసం తెలంగాణలో ఎవరూ రాజ్యసభకు రాజీనామా చేయట్లేదు.. ఆ అవసరం కూడా నాకు లేదు

నా రాజకీయం మధ్యప్రదేశ్‌లోనే.. మీనాక్షి నటరాజన్ స్పష్టీకరణ



**ప్రజా దీవెన, హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీలో తనపై కుట్ర చేసే అవసరం ఎవరికీ లేదని.. ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్ స్పష్టం చేశారు. అది బీజేపీ పుట్టించిన వదంతి అని కొట్టి పారేశారు. మధ్యప్రదేశ్ రాజ్యసభ అభ్యర్థిగా తన నామినేషన్ తిరస్కరణకు ఒక రోజు ముందు ఆ పార్టీ ఈ పుకారు పుట్టించిందన్నారు. అలాగే తెలంగాణ నుంచి తనను రాజ్యసభకు పంపేందుకు ఒక రాజ్యసభ సభ్యునిచేత రాజీనామా చేయిస్తున్నారన్న వార్త కూడా పూర్తిగా అవాస్తవమన్నారు. ఒకరి చేత రాజీనామా చేయించి ఆ రాజ్యసభ సీటును తీసుకోవాల్సిన అవసరం తనకు లేదన్నారు. తన రాజకీయం మధ్యప్రదేశ్ రాష్ట్రంలోనే ఉంటుందని ఆమె తేల్చిచెప్పారు. తమకు ప్రతి సీటూ, ప్రతి సభ్యుడూ ముఖ్యమేనన్నారు. దేశం కోసం అవసరమైనప్పుడు మాత్రమే అలా చేయిస్తారని చెప్పారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, పార్టీ జాతీయ నేత అభిషేక్ మను సింఘ్వి విషయంలో అవసరం కాబట్టే చేయించామని పేర్కొన్నారు. గాంధీభవన్‌లో ఆదివారం మీడియాతో మాట్లాడిన మీనాక్షి నటరాజన్.. మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో ఒక స్థానానికి అవసరమైన 58 మంది సభ్యుల బలం ఉన్నందునే కాంగ్రెస్ అధిష్ఠానం తనను అభ్యర్థిగా ఎంపిక చేసిందని గుర్తుచేశారు. బీజేపీకి ఉన్న సంఖ్యా బలానికి మూడో రాజ్యసభ సీటు వచ్చే అవకాశం ఏమాత్రం లేకున్నా.. ఫౌల్ గేమ్ ఆడాలని ముందే ప్రణాళిక వేసుకున్న ఆ పార్టీ తన అభ్యర్థిని రంగంలోకి దించిందని మండిపడ్డారు. డబ్బులు, బెదిరింపులతో మూడో సీటు రాదని గ్రహించిన బీజేపీ.. ఎన్నికల రిటర్నింగ్ అధికారితో కుమ్మక్కయిందని ఆరోపించారు. తనపై ఎలాంటి క్రిమినల్ కేసులూ లేవని, తెలంగాణలో కేసుకు సంబంధించి కేవలం నోటీసు ఇచ్చారని, అది ప్రీ కాగ్నిజెన్స్‌లోనే ఉందని పేర్కొన్నారు. ఆ కేసును ఫారమ్ 26లో పేర్కొనాల్సిన అవసరమూ లేదన్నారు. దీన్ని గురించి తనను రిటర్నింగ్ అధికారి అడిగినప్పుడు కూడా ఆ కేసు ఎఫ్ఐఆర్ కాలేదని స్పష్టం చేశానన్నారు. 2023లో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో నామినేషన్‌ను సవరించుకునేందుకు పరిమళ్ నత్వానీకి 24 గంటల సమయం ఇచ్చిన ఎన్నికల కమిషన్.. తనకు మాత్రం ఆ అవకాశం ఇవ్వలేదన్నారు. తన నామినేషన్ తిరస్కరణ అంశంలో ఎన్నికల కమిషన్ కుమ్మక్కయిందనే విషయం స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపించారు. తన నామినేషన్ తిరస్కరణకు గురైంది కేసు వల్ల కాదని.. బీజేపీ, ఎన్నికల కమిషన్ కుమ్మక్కయినందువల్లనే జరిగిందని ఆరోపించారు. ఈ పరిణామంతో తాము ఒక్క నిమిషం కూడా నిరాశ చెందలేదన్నారు. బీజేపీ ఎలాంటి రాజకీయం చేస్తోందో దీని ద్వారా దేశానికి చూపించామన్నారు. తాను ఎప్పుడూ బాధితుల పక్షమేనన్న మీనాక్షి.. శివకుమార్‌రెడ్డి కేసులో తీవ్రతను గ్రహించే ఆయనకు ఎన్నికల్లో టిక్కెట్టు ఇవ్వలేదని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

## 30లోగా కమిటీలు పూర్తిచేయండి

### సర్ పట్ల అప్రమత్తంగా ఉండండి .. లోక్‌సభ ఇన్‌చార్జిల సమావేశంలో మీనాక్షి దిశానిర్దేశం

ఈ నెల 30కల్లా కాంగ్రెస్ పార్టీ మండల, గ్రామ కమిటీల ఏర్పాటు పూర్తి కావాలని లోక్‌సభ ఇన్‌చార్జిలను పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆదేశించారు. రాబోయే ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి చాలా కీలకమని, గ్రామస్థాయి నుంచీ పార్టీ బలోపేతంపైన దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే ఈ నెల 25 నుంచి కేంద్ర ఎన్నికల కమిషన్ చేపట్టిన ఎస్ఐఆర్(సర్) ప్రక్రియ పట్లా అప్రమత్తంగా ఉండాలన్నారు. క్షేత్రస్థాయి నుంచి పార్టీ నిర్మాణం కోసం చేపట్టిన సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమం పురోగతి, సర్ ప్రక్రియపై ఆదివారంనాడు గాంధీభవన్‌లో లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జిలతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆమె ఈ మేరకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మీనాక్షితో పాటుగా టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, లోక్‌సభ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల కమిషన్ చేపడుతున్న సర్ ప్రక్రియనే వచ్చే ఎన్నికల్లో ఓటర్లు ఎవరన్నది నిర్ణయిస్తుందని, ఈ నేపథ్యంలో ఆ ప్రక్రియ పట్ల అందర్రూ అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. మహేష్‌గౌడ్ మాట్లాడుతూ.. బూత్ స్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయాలన్నారు. ప్రతి కార్యకర్త ప్రజలతో నిరంతరం మమేకం కావాలన్నారు. ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో మరింత చురుకుగా పనిచేయాలన్నారు. సర్ ప్రక్రియలో అర్హులైన ప్రతి ఓటరు పేరు నమోదు అయ్యేలా చూడాలన్నారు. ఓటు హక్కు పరిరక్షణలో కాంగ్రెస్ నాయకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

### అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?: మహేశ్‌గౌడ్

కాంగ్రెస్ ప్రభుత్వ రెండున్నరేళ్ల పాలనలో తెలంగాణలో జరిగిన అభివృద్ధి.. కేంద్రంలో బీజేపీ 12 ఏళ్ల పాలనలో చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..? అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావుకు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ సవాల్ విసిరారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాల కల్పన, విదేశాల నుంచి నల్లధనాన్ని తెచ్చి పేదల అకౌంట్లలో వేస్తామంటూ ఎన్నికల ముందు ప్రధాని మోదీ ఇచ్చిన హామీల అమలు గురించి రాంచందర్‌రావు మాట్లాడాలన్నారు. ఆయన తమకు ప్రధాని మోదీ సమయం ఇప్పిస్తే బీజేపీ మూడు ఎన్నికల మేనిఫెస్టోల్లో ఇచ్చిన హామీల అమలు గురించి అడుగుతామన్నారు. ఆ తర్వాత రాహుల్‌గాంధీ సమయం గురించి మాట్లాడవచ్చన్నారు. గాంధీభవన్‌లో ఆదివారంనాడు మీడియాతో ఈ మేరకు మాట్లాడారు. కాగా.. లంబాడాలకు ఎస్టీ రిజర్వేషన్లు అమలై 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ నెల 25 నుంచి ఆదివాసీ కాంగ్రెస్ బస్సుయాత్ర చేపట్టనుంది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం నాడు మహేష్‌గౌడ్ ఆవిష్కరించారు.

# ప్రపంచశాంతికి ప్రయత్నంగా 'యోగ'



**కోల్‌కతా :** భూగోళంపై నిత్యం ఏదో ఒకచోట అశాంతి, ఘర్షణలు చెలరేగుతున్న ప్రస్తుత తరుణంలో యోగ సాధన ప్రపంచానికి శాంతిని చేకూర్చగలదని ప్రధాని మోదీ అన్నారు. పిల్లలు, పెద్దలు అన్న తేడా లేకుండా ప్రతి ఒక్కరూ యోగ సాధన చేయాలని పిలుపునిచ్చారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కోల్‌కతాలోని రెడ్‌రోడ్డు మైదానంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో మోదీ పాల్గొన్నారు. బెంగాల్ సీఎం సువేందు అధికారి, గవర్నర్ ఆర్ఎన్ రవి, మంత్రులు, సెలబ్రిటీలతోపాటు వేలాది మంది సామాన్యులతో కలిసి ప్రధాని యోగాసనాలు వేశారు. 'సమస్యలను అధిగమించటానికి సరైన శ్రమ, పౌష్టికాహారం, నిద్రతో కూడిన సమతుల్య జీవన విధానం అలవర్చుకోవాలి. దీనిని యోగ సాధన ద్వారా సాధించవచ్చు. యోగా శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుంది. తద్వారా మనలో అంతర్గత శాంతిని నెలకొల్పటంతోపాటు ప్రపంచానికి శాంతినిస్తుంది' అని మోదీ అన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో యోగా దినోత్సవంలో పాల్గొన్నారు. 'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్' అనే నినాదంతో ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారత త్రివిధ దళాలు కూడా ఈ వేడుకల్లో పాల్గొన్నాయి. అస్సాంలోని తేజ్‌పూర్‌లో సైన్యం నేతృత్వంలో నిర్వహించిన యోగా డే వేడుకల్లో సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది పాల్గొన్నారు. సుప్రీంకోర్టు ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పాల్గొని యోగాసనాలు వేశారు. చైనా, అమెరికా, యూరప్, జపాన్, బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా, న్యూజీలాండ్ తదితర దేశాల్లో భారతఎంబసీల ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు.

## సముద్ర రంగంలో సమృద్ధిగా ఉపాధి

### అభివృద్ధి, సంపద, భద్రత.. సముద్రాలతోనే సాధ్యం

### భవిష్యత్తులో లక్షలాది మందికి ఉపాధి.. అగ్రయ్ ప్రారంభంలో ప్రధాని మోదీ



**కోల్‌కతా :** సముద్ర రంగంలో పట్టు సాధించకుండా ఏ దేశమూ గొప్ప శక్తిగా ఎదగలేదని... అభివృద్ధి, సంపద, భద్రత అన్నీ సముద్రాలతోనే ముడిపడి ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. భారత్ కూడా కేవలం రక్షణ పరికరాలు కొనుగోలు చేసే దేశంగానే మిగిలిపోకుండా.. వాటిని ఉత్పత్తి చేసే దేశంగా ఎదుగుతోందని చెప్పారు. తద్వారా రానున్న కాలంలో సముద్ర రంగంలో ప్రపంచ స్థాయి నిర్ణయాలు తీసుకునే శక్తిగా అవతరిస్తుందని స్పష్టం చేశారు. గత కొన్నేళ్లలో 40కి పైగా యుద్ధ, సర్వే నౌకలు, జలాంతర్గాములు భారత నౌకాదళంలో చేరాయని.. మరో 45 నిర్మాణ దశలో ఉన్నాయని వెల్లడించారు. అత్యాధునిక స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన స్టెల్త్ ఫ్రిగేట్ 'ఐఎన్ఎస్ దునగిరి', సర్వే నౌక 'ఐఎన్ఎస్ సంశోధక్', జలాంతర్గామి వ్యతిరేక యుద్ధనౌక 'ఐఎన్ఎస్ అగ్రయ్' అనే మూడు నౌకలను ప్రధాని మోదీ ఆదివారం ప్రారంభించి.. జాతికి అంకితం చేశారు. కోల్‌కతాలోని శ్యామా ప్రసాద్ ముఖర్జీ పోర్టు వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. సముద్ర రంగం రానున్న రోజుల్లో దేశంలో లక్షలాది మందికి ఉపాధి కల్పించే ఎంప్లాయ్‌మెంట్ ఇంజిన్‌గా మారనుందని చెప్పారు. భవిష్యత్తులో సముద్ర రంగంలో భారత్ ప్రపంచస్థాయి నిర్ణయకర్తగా మారుతుందని, ఆ దిశగా అడుగులు వేస్తున్నామని పేర్కొన్నారు. కాగా, స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ మూడు యుద్ధ నౌకల చేరికతో నౌకాదళ బలం మరింత పెరగనుంది.

#### ఐఎన్ఎస్ దునగిరి

ప్రధాని మోదీ ప్రారంభించిన మూడు నౌకల్లో ఐఎన్ఎస్ దునగిరి పెద్దది. ఇదొక స్టెల్త్ ఫ్రిగేట్ నౌక. శత్రువుల రాడార్లు, సెన్సర్లకు చిక్కకుండా అధునాతన టెక్నాలజీతో దీన్ని నిర్మించారు. తీరానికి చాలా దూరంలో పనిచేసేలా దీన్ని తయారు చేశారు. నేవీలో విశిష్ట సేవలందించిన ఐఎన్ఎస్ నీలగిరి శ్రేణిగా ప్రాజెక్ట్ 17ఏలో భాగంగా దునగిరిని ఎంతో ప్రత్యేకంగా నిర్మించారు. దీనిలో బ్రహ్మో స్ క్షిపణులతోపాటు మధ్యశ్రేణి మిస్సైల్స్ వంటి ఆయుధా లు, మల్టీ ఫంక్షన్ సర్వైలెన్స్, ట్రాక్ అండ్ గైడెన్స్ రాడార్, సోనార్, సెన్సర్లు, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ వ్యవస్థలు, జలాంతర్గామి వ్యతిరేక ఆయుధాలు ఉన్నాయి. 149 మీట ర్ల పొడవు, 6,670 టన్నుల బరువుండే ఈ నౌక గంటకు 28 నాటికల్ మైళ్ల వేగంలో ప్రయాణించగలదు.



## గ్యారంటీగా గ్యాసిఫికేషన్ పరిశ్రమల ప్రతిష్ఠాపన

### ఎరువుల ఉత్పత్తిలోనూ సాధిస్తాం

### దేశవ్యాప్తంగా 50 కోల్ గ్యాసిఫికేషన్ కంపెనీల ఏర్పాటే లక్ష్యం

### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

**చెన్నై, జూన్ 21 :** మూడేళ్లలో పెట్రోల్, ఎరువుల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించనున్నామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. తమిళనాడు పర్యటనలో ఉన్న ఆయన ఆదివారం చెన్నైలో విలేకరులతో మాట్లాడారు. దేశంలో భారీగా బొగ్గు నిల్వలు ఉండటంతో కోల్ గ్యాసిఫికేషన్ ద్వారా మెథనాల్, ఇథనాల్, పెట్రోలు, ఫెర్టిలైజర్స్ ఉత్పత్తి చేయనున్నామని చెప్పారు. ఆ దిశగా దేశంలో పలు చోట్ల గ్యాసిఫికేషన్ కంపెనీలు నెలకొల్పనున్నామని తెలిపారు. రెండ్రోజుల క్రితం ఒడిశాలో కోల్ ఇండియా సంస్థ సహకారంతో కోల్ గ్యాసిఫికేషన్ కంపెనీకి భూమి పూజలు జరిగాయని పేర్కొన్నారు. దీనికి కొనసాగింపుగానే రూ.46 వేల కోట్ల ప్రోత్సాహక నిధులతో 50 కోల్ గ్యాసిఫికేషన్ కంపెనీలు నెలకొల్పాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. భారత్ అత్యధిక జనాభా కలిగిన దేశం కనుక ఇతర దేశాల నుండి పెట్రోలు, యూరియా దిగుమతి చేసుకుంటున్నామన్నారు. ప్రతి ఏటా పెట్రోలు, ఎరువుల దిగుమతుల కోసం రూ.3.5 లక్షల కోట్ల నుండి 4.5 లక్షల కోట్ల వరకూ విదేశీ మారక ద్రవ్యాన్ని కోల్పోతున్నామని పేర్కొన్నారు. ఇతర దేశాలపై ఆధారపడడం వల్ల సరఫరా తగ్గినప్పుడల్లా, దేశంలో పెట్రోలు, ఎరువుల కొరత ఏర్పడుతోందన్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. 2029 లోగా పెట్రోలు, ఎరువుల విషయంలో భారత్ స్వయం సమృద్ధిని సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

#### పాలనలో మోదీ రికార్డు

స్వాతంత్ర్యానంతరం మూడుసార్లు ప్రధాని పదవి చేపట్టి, నెహ్రూ కంటే ఎక్కువ రోజులు దేశాన్ని పాలించిన ప్రధానిగా నరేంద్ర మోదీ రికార్డు నెలకొల్పారని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన పాలనలో దేశం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధించిందన్నారు. నిరంతరం కల్లోల పరిస్థితుల మధ్య గడిపే ఈశాన్య రాష్ట్రాల ప్రజలు ప్రస్తుతం ప్రశాంతంగా జీవిస్తున్నారని, ఉగ్రవాదుల సమస్యను నిర్మూలించి శాంతి భద్రతలకు మోదీ అధిక ప్రాధాన్యం ఇచ్చారని పేర్కొన్నారు.

## హోర్మోజ్‌లో హోరెత్తిన హెచ్చరికలు

### ఇజ్రాయెల్ దాడులకు నిరసనగా జలసంధిని మూసేసిన ఇరాన్

### ఇరాన్ చర్యను ధ్రువీకరించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

### దాడులు ఆపకపోతే ఇరాన్‌ను లేకుండా చేస్తామని హెచ్చరిక

### హోర్ముజ్ జలసంధిలో తామే టోల్ వసూలు చేస్తామని ప్రకటన

### ప్రపంచానికి మళ్లీ చమురు కష్టాలు?

### హోర్ముజ్ బంద్‌కు ట్రంపే కారణం: జర్మనీ

### స్విట్జర్లాండ్‌లో చర్చలు.. ఇరాన్ వాకౌట్



**వాషింగ్టన్ :** నాలుగు నెలల సంక్షోభం తర్వాత నాలుగు రోజుల క్రితమే తెరుచుకున్న హోర్ముజ్ జలసంధి మళ్లీ మూతపడింది. చమురు కష్టాలు తీరబోతున్నాయని ప్రపంచం ఊపిరి పీల్చుకునేలోపే తిరిగి మొదలయ్యాయి. సుదీర్ఘ చర్చల తర్వాత అమెరికా–ఇరాన్ మధ్య తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం కుదరటంతో ఈ నెల 17వ తేదీనే జలసంధిని ఇరాన్ తెరిచింది. యుద్ధం వల్ల దాదాపు 110 రోజులపాటు పర్షియన్ గల్ఫ్‌లోనే నిలిచిపోయిన చమురు నౌకలు మెల్లగా గమ్యంవైపు కదిలాయి. కొన్ని నౌకలు జలసంధిని దాటాయి. అంతలోనే లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు చేయటంతో ఆగ్రహించిన ఇరాన్ జలసంధిని శనివారం మూసివేసింది. అయితే, జలసంధి తెరిచే ఉందని శనివారం ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఆదివారం అది మూతపడిందని పరోక్షంగా ఒప్పుకున్నారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘించిందని ఆరోపించారు. పశ్చిమాసియాలో తన మిలీషియా గ్రూపుల ద్వారా దాడులకు పాల్పడుతోందని మండిపడ్డారు. ఈ మేరకు ట్రూత్ సోషల్‌లో ఆయన ఆదివారం పోస్టు పెట్టారు. 'ఇరాన్ తన మిలీషియా గ్రూపులతో దాడులకు పాల్పడుతూ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. ఎంవోయూ ప్రకారం 60 రోజుల్లో శాశ్వత శాంతి ఒప్పందం కుదరకపోయినా, ఇరాన్ ఈ పరోక్ష దాడులు ఆపకపోయినా ఆ దేశంపై గతంకంటే భీకరంగా దాడులు చేస్తాం. ఇరాన్ అనే దేశమే లేకుండా చేస్తాం' అని హెచ్చరించారు. హోర్ముజ్ జలసంధి ఎప్పటికీ స్వేచ్ఛాయుత వాణిజ్య రవాణా మార్గంగా ఉంటుందని చెప్తూ వచ్చిన ట్రంప్.. తాజాగా మాట మార్చారు. జలసంధిలో తామే టోల్ వసూలు చేస్తామని ప్రకటించారు. 'ఈ 60 రోజులు జలసంధిలో ఎలాంటి టోల్ ఫీజు ఉండదు. 60 రోజుల్లో ఇరాన్ మాతో శాశ్వత శాంతి సంధి కుదుర్చుకుంటే ఆ తర్వాత కూడా టోల్ వసూలు ఉండదు. కానీ, శాంతి ఒప్పందం కుదరకపోతే మాత్రం మేమే టోల్ ఫీజు వసూలు చేస్తాం. పర్షియన్ గల్ఫ్‌లోని దేశాల రక్షణకు గతంలో, ప్రస్తుతం, భవిష్యత్తులో మేము చేసిన, చేసే వ్యయాలకు గాను ఆ దేశాలు రక్షణ పన్ను చెల్లించాల్సిందే. అందుకోసం మేమే హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకల నుంచి టోల్ వసూలు చేస్తాం' అని ప్రకటించారు. అయితే, జలసంధి మళ్లీ మూతపడటానికి ట్రంపే కారణమని జర్మనీ రక్షణ మంత్రి బోరిస్ పిస్టోరియస్ ఆరోపించారు.

#### చర్చలు మొదలు.. ఇరాన్ వాకౌట్

ఇరాన్–అమెరికా మధ్య స్విట్జర్లాండ్‌లో ఆదివారం చర్చలు ప్రారంభమయ్యాయి. గత శుక్రవారమే జరగాల్సిన ఈ చర్చలు.. వాయిదా పడిన విషయం తెలిసిందే. తాజా చర్చల్లో అమెరికా ప్రతినిధి బృందానికి ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నాయకత్వం వహించగా, ఇరాన్ బృందానికి ఆ దేశ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ నేతృత్వం వహించారు. మధ్యవర్తులుగా పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, సైన్యాధ్యక్షుడు అసిమ్ మునీర్, ఖతార్ ప్రధాని షేక్ మొహమ్మద్ బిన్ అబ్దుల్‌రహీమ్ బిన్ జస్సిమ్ అల్ తానీ పాల్గొన్నారు. ఈ చర్చలు ఎడమొహం పెడమొహంగానే మొదలయ్యాయని సమాచారం. చర్చలకు ముందు అమెరికా ప్రతినిధులతో కరచాలనం చేసేందుకు, గ్రూప్ ఫొటో దిగేందుకు ఇరాన్ ప్రతినిధులు ఒప్పుకోలేదని అల్‌జజీరా వార్తా సంస్థ పేర్కొంది. ఈ చర్చల్లో కూడా ట్రంప్ చిచ్చుపెట్టారు. చర్చలు మొదలు కాగానే ఆయన ఇరాన్ దేశాన్నే లేకుండా చేస్తామని సోషల్‌మీడియా వేదికగా హెచ్చరించారు. దీంతో ఇరాన్ ప్రతినిధులు నిరసన వ్యక్తంచేస్తూ వాకౌట్ చేశారు. అమెరికా అధ్యక్షుడు ఇరాన్ గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని ఆ దేశ పార్లమెంటు స్పీకర్ గలిభాఫ్ హెచ్చరించారు. అయితే, ఆ తర్వాత మీడియాతో మాట్లాడిన జేడీ వాన్స్.. చర్చలు ఫలవంతంగా సాగాయని చెప్పారు. ఇరాన్‌తో పరిణామాత్మక దౌత్య సంబంధాల కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. తన జీవితంలో భారత, పాకిస్థానీలు ఇద్దరు అత్యంత ముఖ్యమైన వ్యక్తులని పేర్కొన్నారు. భారతీయురాలు తన సతీమణి ఉష అయితే, పాకిస్థానీ.. ఆ దేశ సైన్యాధ్యక్షుడని తెలిపారు.

## విషం చిమ్మిన వాయువు

**చెన్నై:** తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా ఊత్తుకోట తాలూకా కన్నిగైపేర్ ప్రాంతంలో ఓ ప్రైవేట్ రొయ్యల ప్రాసెసింగ్ కంపెనీలో ఆదివారం ఉదయం అమ్మోనియా గ్యాస్ లీకై ఏడుగురు కార్మికులు మృతి చెందారు. పదుల సంఖ్యలో తీవ్ర అస్వస్థతకు గురై ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరిలో పలువురి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నటుట్ట్ అధికారులు తెలిపారు. కన్నిగైపేర్ ప్రాంతంలో 'సెయింట్ పీటర్ అండ్ పాల్ సీ ఫుడ్ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్' పేరుతో రొయ్యల ప్రాసెసింగ్ కంపెనీని నడుపుతున్నారు. ఆ కంపెనీలో ప్రతిరోజూ రెండు షిఫ్టుల్లో 200 మందికి పైగా కార్మికులు పనిచేస్తుంటారు. వీరిలో ఎక్కువ మంది అసోం, ఒడిసా, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన వలస కార్మికులే. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం సుమారు 120 మంది విధులకు హాజరయ్యారు. ఆ సమయంలో రొయ్యలు నిల్వ చేసే విభాగం నుంచి అమ్మోనియా వాయువు వెలువడింది. దానిని పీల్చిన సుమారు 60 మంది ఊపిరాడక తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కంపెనీ నిర్వాహకులు అస్వస్థతకు గురైన వారిని వెంటనే మంజకరణై ప్రాంతంలో ఉన్న వేల్స్ హాస్పిటల్, వెంకటేశ్వర హాస్పిటల్‌కు తరలించారు. ఈ క్రమంలో వేల్స్ హాస్పిటల్‌లో అత్యవసర చికిత్స విభాగంలో చికిత్స పొందుతూ ఆరుగురు, వెంకటేశ్వర హాస్పిటల్‌లో మరొకరు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమంగా ఉన్నవారిని చెన్నై స్టాన్లీ ప్రభుత్వ ఆసుపత్రికి, రాజీవ్‌గాంధీ స్మారక సర్వజన ఆసుపత్రి (జీహెచ్)కి తరలించారు. రాజీవ్‌గాంధీ స్మారక సర్వజన ఆసుపత్రిలో 9 మంది మహిళా కార్మికులు చికిత్స పొందుతున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నవారిలో సుమారు పది మంది ఆరోగ్య పరిస్థితి తీవ్ర ఆందోళనకరంగా ఉన్నట్టు వైద్యులు ప్రకటించారు. కాగా.. రొయ్యల ప్రాసెసింగ్ కంపెనీ యజమాని మోహన్, ఆయన సోదరుడు జోసెఫ్‌ను పెరియపాళయం పోలీసులు అరెస్టు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు.. ఆ కంపెనీ నుంచి రోజూ రాత్రి పూట విషవాయువులు వెలువడుతున్నాయని, ఈ విషయమై ప్రభుత్వ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని కన్నిగైపేర్ గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

## రంగంలోకి ఎన్డీఆర్ఎఫ్

రొయ్యల ప్రాసెసింగ్ కంపెనీలో అమ్మోనియా గ్యాస్ లీకైన సమాచారం తెలియగానే అరక్కోణం నుంచి జాతీయ విపత్తుల ప్రతిస్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్) సభ్యులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. గ్యాస్ లీకైన ప్రాంతాన్ని పరిశీలించి, లీకేజి నియంత్రణ చర్యలు చేపట్టారు. కార్మికుల మరణంపై తమిళనాడు గవర్నర్ ఆర్వీ ఆర్లేకర్, సీఎం విజయ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి విజయ్ కార్మిక భద్రత శాఖ, ఆరోగ్య శాఖ, కాలుష్య నియంత్రణ మండలి సభ్యులతో వెంటనే విచారణ కమిటీని ఏర్పాటు చేయాలని ఉత్తర్వు జారీ చేశారు. ఈ త్రిసభ్య కమిటీ విచారణ జరిపి 24 గంటల్లోపు ప్రభుత్వానికి మధ్యంతర నివేదిక సమర్పించాలని, మూడు రోజుల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. అమ్మోనియా లీక్ ఘటనపై సీఎం విజయ్ ఆదేశా మేరకు సమగ్ర విచారణ జరుపనున్నట్టు రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ మంత్రి పర్వేజ్ ప్రకటించారు.

ప్రజా దీవెన
సమ సమాజ సంక్షేమం మా సంకల్పం...

# ఈ నెల 22న 24న జరిగే మంత్రుల పర్యటనలను జయప్రదం చేయాలి

**ఎమ్మెల్యే మందుల సామేలు**



**ప్రజా దీవెన, తుంగతుర్తి :** తుంగతుర్తి నియోజకవర్గం లో ఈనెల 22న 24న మంత్రులు పర్యటించనున్నారని వారి పర్యటనలను జయప్రదం చేయాలని స్థానిక శాసనసభ్యులు మందుల సామేలు అన్నారు, ఆదివారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు, తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, పర్యాటక, ఎక్సైజ్, సాంస్కృతిక మరియు పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ల పర్యటనలను విజయవంతం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని అన్నారు జూన్ 22న నాగారం మండలం పణిగిరి గ్రామంలో రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్, సాంస్కృతిక మరియు పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటించనున్నారని తెలిపారు. అలాగే జూన్ 24న నూతనకల్ మండలంలో రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు పర్యటన కార్యక్రమం ఉన్నందున వాటిని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి కాంగ్రెస్ కార్యకర్తపై ఉందన్నారు.

ఈ పర్యటనలకు సంబంధించిన ఏర్పాట్లు, జన సమీకరణ, సమావేశాల నిర్వహణ తదితర అంశాలపై నాయకులతో విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. ముఖ్యంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సభను చారిత్రాత్మక విజయం గా నిలపాలని, అందుకోసం ప్రతి గ్రామం నుంచి భారీ సంఖ్యలో ప్రజలను తరలించేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. సభకు కనీసం ఐదు వేల మందికి తగ్గకుండా ప్రజలను సమీకరించడానికి కార్యచరణ రూపొందించాలని నాయకులకు సూచించారు. ఈ పర్యటన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని తెలియజేస్తూ, ప్రతి కార్యకర్త కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును గ్రామ స్థాయిలోకి తీసుకెళ్లేలా కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. పార్టీ బలోపేతంతో పాటు ప్రభుత్వ కార్యక్రమాల విజయవంతానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కోరారు. అంతకుముందు ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, తుంగతుర్తి సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు, గిరిధర్ రెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు రేగటి రవి, దాయం ఝాన్సీ రాజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ అధికారుల విస్తృత దాడులు 650 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం



**ప్రజా దీవెన, తుంగతుర్తి. :** తుంగతుర్తి అర్వపల్లి మండలాల్లో ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి పది లీటర్ల సారాయి స్వాధీనంతో పాటు 650 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్, అధికారులు తెలిపారు, ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ శ్రీ హరికిరణ్ గారి ఆదేశాలానుసారం ఎస్ టి ఎఫ్ టీమ్, సూర్యాపేట టీమ్ మరియు తుంగతుర్తి టీమ్‌లు సంయుక్తంగా జజిరెడ్డిగూడెం మరియు తుంగతుర్తి మండలాలలోని రాజన్న తాండా, అన్నారం, మేడిబాయి తాండా, మర్రిబాయి తాండా మరియు కొమ్మాల గ్రామాలలో విస్తృతంగ దాడులు నిర్వహించడం జరిగిందన్నారు ఈ దాడులలో 10 లీటర్ల ఐ.డి. (సారా) ను స్వాధీనం చేసుకోవడం జరిగినది మరియు 650 లీటర్ల బెల్లం పానకం అక్కడికక్కడే ధ్వంసం చేయడం జరిగిందన్నారు ఈ సందర్భంగా మొత్తం 4 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు .ఈ దాడులలో మూర్తి SI (తుంగతుర్తి), స్వర్ణలత SI (సూర్యాపేట), శోభారాణి SI (STF) మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# యోగతోనే ఆరోగ్యవంతమైన సమాజం సుసాధ్యం

**నల్లగొండ కలెక్టర్ చంద్రశేఖర్**

**ప్రతి ఒక్కరూ యోగ వ్యాయామం,ఫిట్నెస్ కు ప్రాధాన్యత ఇవ్వాలి**









**ప్రజా దీవెన, నల్లగొండ:** యోగాను ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప దేశం భారతదేశమని, నేడు ప్రపంచవ్యాప్తంగా యోగా ప్రాముఖ్యతను గుర్తించి అనుసరిస్తున్నారని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు.ఆదివారం 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పతంజలి సంస్థ, ఆయుష్ శాఖ, జిల్లా క్రీడాశాఖ సంయుక్త ఆధ్వర్యం లో మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన యోగా దినోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై యోగాసనాలు వేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిరోజూ 15 నుంచి 20 నిమిషాల పాటు యోగా చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ప్రస్తుతం శారీరక శ్రమ తగ్గడం, ఆహారపు అలవాట్లలో మార్పుల వల్ల అనేక వ్యాధులు వస్తున్నాయని, యోగా, వ్యాయామం, ఫిట్‌నెస్‌కు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.తాను చదువుకునే రోజుల్లో పెద్దలు "డబ్బు కంటే ఆరోగ్యమే మహాభాగ్యం" అని చెప్పేవారని గుర్తుచేస్తూ, నేటి విద్యార్థులు ప్రతిరోజూ ఆటలతో పాటు, యోగా అలవాటు చేసుకోవాలని అన్నారు. భావి భారత పౌరులైన పిల్లలు ఆరోగ్యంగా, దృఢంగా ఎదగాలని, ప్రతి పాఠశాల, ప్రతి కాలనీలో యోగా నిర్వహించేలా చర్యలు తీసుకునే దిశగా కృషి చేస్తామని తెలిపారు. యోగా గురువులు ఆరోగ్యవంత మైన భావి తరాలను తీర్చిదిద్దడం లో కీలక పాత్ర పోషించాలని కోరారు. ఈ సందర్భంగా పతంజలి సంస్థ ప్రతినిధి కర్నాటి విజయకుమార్ మాట్లాడుతూ యోగా ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో యోగా గురువులను, సేవలందించిన పలువురిని జిల్లా కలెక్టర్ సన్మానించారు.అనంతరం అంతర్జాతీయ ఒలింపిక్ డే సందర్భంగా నిర్వహించిన ర్యాలీని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి రమేష్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ హాఫీజ్ ఖాన్, వైద్యాధికారి రాహుల్ , జిల్లా క్రీడల అధికారి అక్బర్ అలీ, నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్చంద్ర, పతంజలి సంస్థ శ్యాంసుందర్,ఆయుష్ శాఖ సుభాషిని, స్థానిక కార్పొరేటర్ సుభాష్, క్రీడాశాఖ అధికారులు, ప్రతినిధులు, యోగా గురువులు, విద్యార్థులు, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## 12వ పోలీస్ బెటాలియన్‌లో యోగా దినోత్సవం

నల్లగొండ క్రైమ్: అంతర్జాతీయ యోగా మరియు మానసిక సామరస్య దినోత్సవాన్ని పురస్కరించుకుని, నల్లగొండ సమీపంలోని 12వ పోలీస్ బెటాలియన్ రీసెర్చ్ క్యాంపస్‌లో ఒక అద్భుతమైన సాంకేతిక- ఆధ్యాత్మిక ప్రయోగం జరిగింది. ప్రముఖ ఆర్ట్ ఆఫ్ లివింగ్ 'న్యూరో- ట్రాన్స్‌ఫార్మేషన్' నిపుణులు మరియు సీనియర్ అప్లికేషన్ ఇంజనీర్ బాలకృష్ణ ఆధ్వర్యంలో ఈ ఏడాది యోగా ఉత్సవాలు సరికొత్త రూపు సంతరించుకున్నాయి.సాధారణ శారీరక ఆసనాలకు భిన్నంగా, ఈ సారి బెటాలియన్ కమాండర్లు, సిబ్బంది యావత్తు తమ బయో- సూట్లను ధరించి, ఏకకాలంలో 'మైండ్-సింక్' (Mind-Sync) మోడ్‌లోకి ప్రవేశించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఇంజనీర్ బాలకృష్ణ రూపొందించిన అడ్వాన్స్‌డ్ బయో-సిగ్నల్ అల్గారిథమ్స్ సాయంతో, సిబ్బంది యొక్క ఒత్తిడి స్థాయిలను తక్షణమే స్క్రీన్లపై విశ్లేషించారు. ఆయన పర్యవేక్షణలో జరిగిన క్వాంటం ప్రాణాయామం మరియు ధ్యాన ప్రక్రియల వల్ల, రక్షక భటుల ఫోకస్ ఇండెక్స్ కేవలం 20 నిమిషాల్లో 40% పెరిగినట్లు బయో-సెన్సార్లు రికార్డ్ చేశాయి. తీవ్రమైన విధుల్లో ఉండే క్వాంటం సిబ్బంది, సాంకేతికతను యోగాతో ముడిపెట్టి ప్రదర్శించిన ఈ శారీరక-మానసిక నియంత్రణ చూసేవారిని అబ్బురపరిచింది.



## ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్ కు ఘన సన్మానం

భవిష్యత్ పోలీసింగ్‌లో మానసిక ప్రశాంతతకు, సాంకేతికతకు మధ్య సమతుల్యతను సాధించేలా ఈ సెషన్‌ను నడిపించినందుకు గాను, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి, సీనియర్ అప్లికేషన్ ఇంజనీర్,భావజ్ఞ నాగరాజులను బెటాలియన్ ఉన్నతాధికారులు డిజిటల్ గౌరవ పతకంతో పాటు 'క్రిస్టల్ మెమెంటో' అందజేసి ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు, మానసిక దృఢత్వానికి ఇలాంటి 'టెక్-యోగా' సెషన్లు నిరంతరం కొనసాగుతాయని బెటాలియన్ వర్గాలు ప్రకటించాయి.

# ప్రతి ఇంటికి యోగ చేర్చాలి

**ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్ పల్లపు బుద్ధుడు**

**చిట్యాల:** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్ పల్లపు బుద్ధుడు ఆధ్వర్యంలో చిట్యాల మండలం ఊరుమడ్ల గ్రామంలో రైతు వేదిక వద్ద యోగ మెడిటేషన్ కార్యక్రమాలు చేయడం జరిగింది. గ్రామ ప్రజలతో యువకులతో, విద్యార్థులతో యోగా ఆసనాలు వేయించి మెడిటేషన్ కార్యక్రమాలు చేయించారు. యోగా దినోత్సవ సందర్భంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నందుకు శిక్షకులు, విద్యార్థులు అందరూ ఎంతో సంతోషాన్ని ఆనందాన్ని వ్యక్తం చేశారు ఇలాంటి కార్యక్రమాలు ప్రతి నిత్యం చేయాలి అని కొనియాడారు. ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ కోర్సు ఒత్తిడిని పారదోలి, ఆచరణాత్మక చర్యలకు వీలు కల్పిస్తూ, మన ఆరోగ్యాన్ని మరియు జీవశక్తిని పెంపొందిస్తుంది. దీనివల్ల మీరు యోగా యొక్క ప్రాచీన ఆచరణాలు ధ్యానం మరియు ఉచ్ఛ్వాస నిశ్వాసాలను చక్కగా పొందుతారు. జీవితం ఆనందదాయకంగా ఉండాలంటే సుదర్శన క్రియ చేయాలి. సుదర్శన క్రియ ప్రయోజనాలు శారీరక మరియు మానసిక బలహీనత నుండి విముక్తి చెందుతారు. వ్యక్తిగత సంబంధాలను పెంపొందించుకుంటారు, రక్తపోటు మధుమోహాశీ, ఉబ్బసం వంటి మొదలగు వాటిని అరికట్టవచ్చు, ఎన్నో ఒత్తిడి వల్ల వచ్చే వ్యాధులను అరికట్ట వచ్చు అని ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్ పల్లపు బుద్ధుడు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్ నల్గొండ జిల్లా కోఆర్డినేటర్ పల్లలపు బుద్ధుని శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కోనేటి యాదగిరి ఊరుమడ్ల గ్రామపంచాయతీ వార్డు సభ్యులు పాకాల దినేష్, మేడబోయిన స్వాతి శ్రీనివాస్ యాదవ్, గంగాపురం రాము, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ మర్రి రమేష్, పాకాల సత్యనారాయణ, గంగాపురం వెంకన్న, వస్కుల శంకర్, ఉయ్యాల మల్లేష్, వావిళ్ళ మహేష్, మాధగోని నరేష్ గౌడ్, యువజన నాయకులు జన్నపాల రాము, రూపని రవి, పల్లపు శివ, పల్లపు సాయి, స్వామి, నరేష్, శ్రీను, లింగస్వామి, వెంకటేష్, సైదులు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సిలిండర్ పేలుడు కానేకాదు పక్కా స్కెచ్‌తో త్రిపుల్ మర్డర్

**మ్యాట్రిమోనీ కిల్లర్ గుట్టు రట్టు**




**ప్రజా దీవెన, మిర్యాలగూడ :** అది జూన్ 4వ తేదీ రాత్రి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని కలాల్ వాడ ప్రాంతమంతా గాఢ నిద్రలో ఉంది. అకస్మాత్తుగా ఒక ఇంట్లోంచి మంటలు ఎగసిపడ్డాయి. క్షణాల్లో ఇల్లంతా వ్యాపించాయి. ఆ ప్రమాదంలో వనం చంద్రకళ, ఆమె మనవడు లక్ష్మణ్, మనుమరాలు ప్రణతి సజీవ దహనమయ్యారు. గ్యాస్ సిలిండర్ పేలడం వల్లే ఈ ఘోరం జరిగిందని అంతా భావించారు. కానీ, కట్ చేస్తే... సీన్ రివర్స్ అయింది. అది ప్రమాదం కాదు... ముగ్గురిని నిలువునా కాల్చేసిన నరహంతకుడి పక్కా స్కెచ్ అని తేల్చారు పోలీసులు. ఈ ఘాతుకానికి సంబంధించిన వివరాలు నల్లగొండ జిల్లా ఎస్ శరత్ చంద్ర పవార్ ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ ఘాతుకానికి ఒడిగట్టింది ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లాకు చెందిన కాళహస్తి శిరీష్ కుమార్ (38). ఇతగాడి ప్రొఫైల్ చూస్తే మైండ్ బ్లాంక్ అవ్వాల్సిందే. 'తెలుగు మ్యాట్రిమోనీ' వంటి వెబ్‌సైట్ల లో అమాయక మహిళలను టార్గెట్ చేయడం, పెళ్లి పేరుతో నమ్మించి ముంచడం ఇతని అలవాటు. ఇలాగే బాధితురాలు ధనలక్ష్మిని కూడా ట్రాప్ చేసి రెండో పెళ్లి చేసుకున్నాడు. అయితే, శిరీష్ బుద్ధి తెలిసి ధనలక్ష్మి అతడిని దూరం పెట్టింది. గతంలో హాజీపూర్‌లో ఒక మహిళను మోసం చేసిన కేసులో శిరీష్ జైలుకు వెళ్ళాడు. ఆ సమయంలో భార్య ధనలక్ష్మి తనకు ఎలాంటి సహాయం చేయకపోవడం, బెయిల్ కోసం ప్రయత్నించకపోవడంతో ఆమెపై పీక్స్ లో కసి పెంచుకున్నాడు. ఎలాగైనా ఆమెను, ఆమె కుటుంబాన్ని ఖతం చేయాలని జైలు లోనే రివెంజ్ ప్లాన్ సిద్ధం చేసుకున్నాడు.

## దొంగ స్కూటీ, ప్లాస్టిక్ క్యాన్, అర్ధ రాత్రి ఘోరం

కథ కంచికి చేర్చడానికి పక్కాగా గ్రౌండ్ వర్క్ చేశాడు శిరీష్. రెక్కీ క్రైమ్ చేయడానికి కొన్ని రోజుల ముందే మిర్యాలగూడ వచ్చి అంతా గమనించాడు. ఘటన జరిగిన రోజు ఉదయం ఒక యాక్టివా స్కూటీని దొంగిలించి మిర్యాలగూడ వైపు బయలుదేరాడు. మార్గమధ్యం లో ఒక ప్లాస్టిక్ క్యాన్ కొని, బంకు లో పెట్రోల్ నింపించుకున్నాడు. ఎవరికీ అనుమానం రాకుండా రోజంతా బైక్ పైనే తిరిగాడు. అర్ధరాత్రి అందరూ నిద్రపోయాక... పిల్లిలా ఇంట్లోకి చొరబడ్డాడు. అక్కడ ఉన్న ప్లాస్టిక్ బకెట్‌లో పెట్రోల్ పోసి, నిద్రిస్తున్న ముగ్గురిపై చల్లాడు. అగ్గిపుల్ల గీసి మంటలు అంటించాడు. ఈ క్రమంలో వాడికి కూడా గాయాలయ్యాయి, అయినా అక్కడి నుంచి గుట్టుచప్పుడు కాకుండా పారిపోయాడు.ఆ రోజు అదృష్టవశాత్తూ ధనలక్ష్మి ఇంట్లో లేక పోవడంతో ప్రాణాలతో బయట పడింది. కానీ, ఆమె తల్లి, ఇద్దరు పిల్లలు మంటల్లో కాలి బూడిదయ్యారు. సిలిండర్ పేలుడుగా చిత్రీకరించాలని శిరీష్ చూసినా, నల్లగొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ బృందానికి అనుమానం వచ్చింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని నమ్ముకుని రంగంలోకి దిగిన పోలీసులకు కీలక ఆధారాలు దొరికాయి. కాలిపోయిన ఇంటి వెనుక పెట్రోల్ వాసన వస్తున్న బకెట్ దొరికడం, వందలాది సీసీటీవీ ఫుటేజీలు, నిందితుడి మొబైల్ సిగ్నల్స్ ట్రాక్ చేశారు,చివరకు నిందితుడిని పట్టుకుని, దొంగిలించిన స్కూటీ, పెట్రోల్ క్యాన్, పాక్షికంగా కాలిన షర్ట్, హెల్మెట్, ఘటనా స్థలంలో వదిలేసిన చెప్పులను స్వాధీనం చేసుకున్నారు.ఇదిలా ఉండగా అత్యంత క్లిష్టమైన ఈ కేసును వేగంగా ఛేదించిన డీసీ ఆర్‌బీ డీఎస్పీ జి. రవి, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ నాగ భూషణరావు బృందాన్ని ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రత్యేకంగా అభినందించి నగదు పురస్కారాలు అందించారు.

## పిడుగులాంటి నిజం, పీఎస్ ముందే ఆత్మహత్యాయత్నం

సిలిండర్ పేలి చనిపోయారనుకున్న తన పిల్లలను, తల్లిని శిరీష్ కు మార్ కసితీరా పెట్రోల్ పోసి చంపేశాడని తెలిసి ధనలక్ష్మి గుండె పగిలిపోయింది. ఆదివారం మిర్యాల గూడ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆమె ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించడం సంచలనం సృష్టించింది. "నా తల్లిని, పిల్లలను రాక్షసంగా చంపిన ఆ నరహంతకుడిని ఉరితీయాలి, వాడు బెయిల్‌పై వస్తే నన్ను కూడా వదలడు... నన్నూ చంపేస్తాడు" అంటూ ఆమె రోదించిన తీరు స్థానికులను కన్నీరు పెట్టించింది. సమయ స్ఫూర్తితో స్పందించిన పోలీసులు, స్థానికులు ఆమెను అడ్డుకోవడం తో ప్రమాదం తప్పింది. ప్రస్తుతం నిందితుడు కటకటాలపాలయ్యాడు.

# నల్లగొండలో గౌడ శంఖారావం

## పా తబస్తీలో నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

**ప్రజా దీవెన నల్లగొండ టౌన్:** నల్లగొండ పాతబస్తీ గౌడ సంఘం చరిత్రలో ఒక నూతన అధ్యాయం లిఖించబడింది. ఐక్యత, సేవే ల క్ష్యాలుగా నూతనంగా ఎన్నికైన క మిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్స వంతో పాటు కార్పొరేటర్ల సన్మాన కార్యక్రమం స్థానిక గౌడ సంఘ భవ నం వేదికగా అత్యంత వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన గౌడ సంఘం పెద్దలు బైరగోని రాజయ్య గౌడ్ మాట్లాడుతూ సమాజంలో మార్పు కోసం ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని పిలుపుని చ్చారు. ప్రతి వార్డులో గౌడ సంఘ కమిటీ లవలను బలోపేతం చేయడం ద్వారానే మన ఐక్యత చాటగలం. సామాజిక సేవా కార్యక్రమాల్లో మ నమే ముందుండాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

### కూడలిలో పాపన్న గౌడ్ విగ్రహం

మరో ముఖ్య నేత తండు సైదులు గౌడ్ మాట్లాడుతూ వీరత్వానికి ప్ర తీక అయిన సర్దార్ సర్వాయి పాప న్న గౌడ్ విగ్రహాన్ని పట్టణంలోని ప్ర ధాన కూడలిలో త్వరలోనే ఏర్పా టు చేస్తామని సగర్వంగా ప్రకటిం చారు. ఈ ప్రకటనతో సభా ప్రాం గ ణం హర్షధ్వానాలతో మారుమో గింది.

### భవనానికి అండగా 'కందుల' కు టుంబం

సమాజ శ్రేయస్సు కోసం దివంగత కందుల యాదగిరి గౌడ్ స్మారకార్థం వారి కుటుంబ సభ్యులు సతీ మ ణి కందుల నిర్మలమ్మ గౌడ్, కు మారులు బాలరాజు గౌడ్, రమణ గౌడ్) ఒక అద్భుతమైన



నిర్ణయా న్ని తీసుకున్నారు. గౌడ సంఘ భ వన నిర్మాణానికి తమ వంతుగా పూర్తి సహకారాన్ని అందిస్తామని ప్రకటించి అందరికీ ఆదర్శంగా నిలిచారు.

### నూతన కమిటీ సారథులు వీరే

భవిష్యత్తు ప్రణాళికలతో బాధ్య తలు స్వీకరించిన నూతన కార్య వర్గంలో అధ్యక్షుడుగా పెద్దగోని సు రేష్ గౌడ్, ఉపాధ్యక్షునిగా బోయప ల్లి వెంకటేశ్వర్లు గౌడ్ ముఖ్య స భ్యులుగా పుల్లెంల రాము గౌడ్, చె న్నగోని లింగస్వామి గౌడ్, బోయ పల్లి మధు గౌడ్, కొమ్మగోని సతీష్ గౌడ్, ఐతగోని రమేష్ గౌడ్, వా యుల నాగరాజు గౌడ్, అనంతల యాదగిరి గౌడ్, ఐతగోని గణేష్ గౌడ్ తదితరులు బాధ్యతలు స్వీకరించారు. ఈ వేడుకలో గౌడ





సామాజికవర్గ కార్పొరేటర్లు రేగట్టే అండాలు లింగ స్వామి గౌడ్, గోపగోని స్వాతి రాజ శేఖర్ గౌడ్, పాలకూరి సుమలత సంతోష్ గౌడ్‌లతో పాటు స్థానిక కా ర్పొరేటర్ గుండబోయిన పుష్పలత వెంకన్న యాదవ్, అక్కనపల్లి రేవ తి, బలరాం, మామిడి కార్తీక్ తది తరులు పాల్గొన్నారు. అలాగే పెద్ద లు తండు సైదులు గౌడ్, పుల్లెంల యాదగిరి గౌడ్, సురిగి వెంకన్న గౌ డ్‌లు నూతన కమిటీని అభినందిం చారు. ఈ కార్యక్రమంలో పాత బ స్తీకి చెందిన యువకులు, మహిళ లు మరియు గౌడ సంఘ సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొని, నూతన కమిటీకి అండగా ఉంటామని ప్రతి జ్ఞ చేస్తూ కార్యక్రమాన్ని విజయ వంతం చేశారు.

---

## మెరుగైన వైద్య సేవలు అందించాలి: ఎమ్మెల్యే



**ప్రజా దీవెన,కోదాడ:** పట్టణంలోని హుజూర్ నగర్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన జి వీ హాస్పిటల్ ను స్థానిక సభ్యురాలు పద్మావతి రెడ్డి ప్రముఖ వైద్యులు జాస్తి సుబ్బారావు తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె హెల్త్ చెకప్ చేయించుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దిన దినాభివృద్ధి చెందుతున్న కోదాడ పట్టణానికి జీ వీ హాస్పిటల్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు కోదాడ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మెరుగైన వైద్య సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలని డాక్టర్లకు యాజమాన్యానికి సూచించారు. పేదలకు అతి తక్కువ ఖర్చులో నాణ్యమైన వైద్య సేవలను అందించాలన్నారు. వైద్యులు సేవాభావంతో పనిచేస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని, రాబోయే రోజుల్లో వైద్యం అంటే కోదాడ గుర్తుకు వచ్చేలా పనిచేయాలని గుర్తు చేశారు. జీవి హాస్పిటల్ యాజమాన్యం మాట్లాడుతూ అత్యాధునిక వైద్య పరికరాలు, అనుభవజ్ఞులైన వైద్య సిబ్బంది సేవలు అందుబాటులో ఉంటాయని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో , కోదాడ మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్నేని కుసుమ వెంకటరత్నం బాబు, వైస్ చైర్ పర్సన్ దేవరపల్లి మల్లేశ్వరి, కాంగ్రెస్ నాయకులు ఎర్నేని బాబు , కారింగుల అంజన్ గౌడ్,అమీనాబాద్ మాజీ సర్పంచ్ ముత్తినేని కోటేశ్వరరావు , మున్సిపల్ కౌన్సి లర్లు, కందుల కోటేశ్వరరావు , కాంగ్రెస్ మహిళ నాయకులు కోదాడ టౌన్ లో ఉన్న వివిధ హాస్పిటల్ డాక్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళి



**ప్రజా దీవెన, నల్లగొండ టౌన్:** తెలంగాణ సిద్ధాంత కర్త, ఆచార్య జయశంకర్ 15 వ వర్ధంతి సందర్భంగా నల్లగొండ మున్సిపల్ ఆఫీస్ ప్రక్కన గల వారి విగ్రహానికి నల్లగొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి, బిఆర్ఎస్ ముఖ్య నేతలు పూల మాలలు సమర్పించి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రసిద్ధికొరకు, జయశంకర్ సిద్ధాంతాలు వ్యూహాలు.. ఎంతో ఉపయోగ పడ్డాయాని.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును, కెసిఆర్ పాలను వారు చూసుంటే, ఎంతో సంతోషించే వారని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం జయశంకర్, ఆశయాలను తుంగలో తొక్కి రాష్ట్ర అభివృద్ధి ని నిర్లక్ష్యం చేస్తున్నారని, తెలంగాణ ప్రజలకు ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి మోసం చేసిందని అన్నారు. జయశంకర్ ఆశయాల సాధన కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలనీ కోరారు. ఈ కార్యక్ర మంలో ఏ ఎం సి మాజీ చైర్మన్ చీరా పంకజ్ యాదవ్, జేఏసీ జి వెంకటేశ్వర్లు, మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మాజీ ఆర్వో మాలే శరణ్యా రెడ్డి, అభిమన్యు శ్రీనివాస్, సింగం రామ్మోహన్, నగర పార్టీ అధ్యక్షులు బోనగిరి దేవేందర్, కనగల్, నల్లగొండ మండల పార్టీ అధ్యక్షులు అయితగోని యాదయ్య, దేప వెంకట్ రెడ్డి, కార్పొరేటర్ లు మారగోని భవాని గణేష్, పేర్ల మల్లీశ్వరి అశోక్, కుందూరు దీపిక ప్రవీణ్ రెడ్డి, బాణావత్ దీప్లా, గోపగోని స్వాతి రాజశేఖర్, రావుల శ్రీనివాస రెడ్డి, యుగంధర్ రెడ్డి జమాల్ ఖాద్రి, దండంపల్లి సత్తయ్య, కన్నారావు, సింగం లక్ష్మి, పల్లె రంజిత్, బడుపుల శంకర్, గుండెబోయిన జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సాగుయోగ్యమైన భూములకే రైతుభరోసా ఇవ్వాలి

### ప్రభుత్వాల ఉచిత పథకాలు వ ద్దు

### శాసన మండలి చైర్మన్ గుత్తా సు ఖేందర్ రెడ్డి



**ప్రజా దీవెన, నల్లగొండ :** భూముల విలువ పెంచడంతో రెవెన్యూ పరంగా విచ్చలవిడిగా అవినీతి పెరిగిపోతుందని, ధరణి స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం భూభారతి తీ సు కువచ్చినా అవినీతి ఏమాత్రం తగ్గ లేదని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్రెడ్డి విమర్శించారు. చిన్న చిన్న పనులకు కూడా కుంటిసాకు లు చూపుతూ అధికారులు కొర్రీలు పెడుతుండ టంతో సామాన్య రైతు లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రని ఆవేదన వ్యక్తంచేశారు. సర్వే విభాగంలో ఒకప్పుడు 700 జీతం లో ఉద్యో గంలో చేరిన డిప్యూటీ డైరెక్టర్ ఇంట్లో కోట్ల రూపాయల నగదు, బంగారం దొరుకడం అంటే అవినీతి ఏవిధంగా పాతుకుపో యిందో అర్థం చేసుకోవాలని చెప్పారు. ప్రభుత్వం అన వసర ఖర్చులు తగ్గించాలని, అవసరం లేని ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీలు ఎందు కని ప్రశ్నించారు. ఆదివారం నల్ల గొండలోని తన నివాసంలో ఆ య న మీడియాతో చిట్ చాట్ నిర్వ హించారు. ఇందులో అనేక విష యాలపై ఆయన స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి కూడా చురకలంటిం చారు. అసలే మాత్రంగా ఉన్నప్పు డు ప్రజ రాష్ట్ర ర్థిక పరిస్థితి అం తం తలకు ఉపయోగపడే పథకాలపైనే దృష్టి సారించాలని హితవుపలికా రు. ఆయా రాజకీయ పార్టీలు ఎ న్నికల్లో ఇచ్చే ఉచిత హామీలపై పున చేసే దమ్ము ఉండాల్సిన దు స్థితి దాపురించిందని వాపో యా రు. ఎన్టీఆర్ మరణానంతరం చం ద్రబాబు టీడీపీ నుంచే డబ్బు అం శాలు విడిగా మారిందని చెప్పారు. అందుకే అటు తెరపైకి వచ్చా య ని, ప్రస్తుత పరిస్థితి విచ్చల పార్ల మెంట్, ఇటు అసెంబ్లీలో కాంట్రా క్టర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమా న్యాలు, రిటైర్డ్ ఐఆర్ఎస్, ఐపీఎస్ల లాంటి వాళ్లు పోటీ చేసి గెలుస్తున్నారని ఉదహరించారు. రాజకీయ వ్యవ స్థను పూర్తిగా భ్రష్టుప ట్టించడంలో అన్ని పార్టీల పాత్ర ఉన్నదని, సర మని, అవినీతి పరుల ఆస్తులను 'ఇట్లాంటి వాటిపై కఠిన చట్టాలు, శిక్షలు అవ స్వాధీనం చేసుకో వాలని, ప్రజాస్వామ్యం 'బలంగా ఉండాలంటే రాజకీయ అవినీతికి చెక్ పడాలని అభిప్రాయపడ్డారు. అధికార వ్యవస్థలో సైతం అవినీ తిపై కఠినంగా వ్యవ హరించాలని చెప్పారు. 'ఒకనాడు నేను సైతం నక్సలైట్ల బాధితుడినే.. కానీ ఇప్ప టి ఉంటేనే బాగుంటుందేమో అని పిస్తున్నది' పరిస్థితులు చూస్తుంటే వాళ్ల లాంటి వాళ్లు అని సంచలన వ్యాఖ్యలు చేశారు.

## యోగా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పునాది



**ప్రజా దీవెన, నల్లగొండ టౌన్:** అంతర్జాతీయ యోగా దినోత్సవా న్ని పురస్కరించుకుని ఆదివారం నల్గొండ పట్టణంలోని వెంకటేశ్వర కాలనీ పార్కులో యోగా కార్యక్ర మాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, యువత, మహిళలు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, యోగా భారతీయ సంస్కృతికి ప్రతీకగా నిలిచిందని, శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. నేటి వేగవంతమైన జీవనశైలిలో ఒత్తిడి, ఆందోళన, అనారోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో యోగా ప్రతి ఒక్కరికీ అవసరమైందని పేర్కొన్నారు. ప్రతిరోజూ యోగా, ప్రాణాయామం చేయడం ద్వారా శరీర దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెరుగుతాయని తెలిపారు. యోగా కేవలం వ్యాయామ విధానం మాత్రమే కాకుండా సంపూర్ణ ఆరోగ్యానికి మార్గదర్శకమని, చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం యోగా నిపుణుల ఆధ్వర్యంలో వివిధ యోగా ఆసనాలు, ప్రాణాయామాలు నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు, యువకులు, మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. "ఆరోగ్యమే మహాభాగ్యం... యోగానే ఆరోగ్యానికి మూలం" అనే సందేశంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో లెంకలమోహన్ రెడ్డి, రిటైర్డ్ వార్డెన్ కత్తుల షణ్ముఖ, ఆలకుంట్ల రవి , పానుగంటిశ్రీశైలం , సిరిపురం బిక్షమయ్య, కట్ట శంతన్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి ,పసుల నాగరాజు యాదవ్, గణపతి రావు, వెంకటేశ్వర్లు ,జెవి నారాయణ, స్వామి, వివేక్ రెడ్డి, సురేష్, నరసింహ, యాదగిరి, మధుసూదన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అడ్లూర్, ఆకారం, పెర్కకొండారం స్కూళ్లలో ప్రీ-ప్రైమరీ పోస్టుల భర్తీ కి దరఖాస్తులు

**శాలిగౌరారం:** మండలంలోని అడ్లూర్,ఆకారం, పెర్కకొండారం ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ స్కూల్ మంజూరయ్యాయని శాలిగౌరారం ఎంఈఓ మందుల సైదులు తెలిపారు. ప్రీ -ప్రైమరీ స్కూల్ లో తాత్కాలికంగా పనిచేసేందుకు ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు అయన తెలిపారు. నేటి నుంచి జూన్ 26 సాయంత్రం 4 గంటల వరకు శాలిగౌరారం మండల విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు ఇంటర్మీడియట్ అర్హత, ఎర్లీ చైల్డహుడ్ ఎడ్యుకేషన్ లేదా ప్రైమరీ టీచింగ్ అర్హత ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఆయా పోస్టుకు 7వ తరగతి ఉ త్తీర్ణులైనవారు అర్హులని,7వ తరగతి మార్కుల షీట్ తప్పనిసరిగా జత చేయాలని కోరారు.

## యోగాతో మానసిక ప్రశాంతత

### పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు



**ప్రజా దీవెన తుంగతుర్తి :** యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని తుంగతుర్తి సీఐ ఉ పేందర్ రావు, ఎస్ఐ క్రాంతికుమార్ అన్నారు. ఆదివారం తుంగతుర్తిలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సిబ్బందితో యోగా అభ్యాసకుడు గోపాల్ రావు ఆసనాలు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనిషి దైనందిన జీవితంలో యోగా భాగం కావాలన్నారు. యోగా సాధనతో అనేక శారీరక రుగ్మతలు దూరం అవుతాయని, యోగా వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో దోహదం చేస్తాయని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత యోగాతో చెడువాలు వార్తకు దూరం కావచ్చని యోగ అభ్యాసం వల్ల శారీరకంగా ఎన్నో ప్రయోజనాలు మానసికంగా పరిపక్వత పొందడానికి అవకాశాలు ఉ న్నాయని వారన్నారు ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులతో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు

## రైతులకు రైతు భరోస ఇవ్వలేని ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలి

### బి ఆర్ ఎస్ నేత మట్టిపల్లి వెంకట్ యాదవ్..

**ప్రజా దీవెన తుంగతుర్తి :** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇవ్వాల్సిన రైతు భరోసా తక్షణమే అందించాలని బి ఆర్ ఎస్ నేత మట్టిపల్లి వెంకట్ యాదవ్ డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం మండల కేంద్రం లో విలేకరులు సమావేశం లో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రికి రైతులంటే ఎందుకు ఇంత చిన్న చూపని , రైతుల కు యాసంగి రైతు భరోసా ఇవ్వక పోగా నేడు వానాకాలం రైతులు నార్లు పోసి రైతు భరోసా కోసం ఎదురు చూస్తున్నారని గతం లో 2నెలల్లో రైతులకు మొత్తం రైతు భరోసా ఇస్తానని మోసం చేశాడని .నేడు వానాకాలం సాగు మొదలవుతున్న రైతులను పట్టించుకోక పోవడం రైతుల పై ముఖ్యమంత్రికి ,ప్రభుత్వానికి ఎంత చిత్త శుద్ధి ఉన్నదో అర్థమవుతున్నది ఆయన ఎద్దేవ చేశారు ., ఈ ప్రభుత్వానికి రైతులన్నా రైతులకు పెట్టుబడి ఇవ్వాలన్న ఎందుకు ఇంత కోపం అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లో కి వచ్చినప్పడీ నుడి మూడు సార్లు రైతు భరోసా ఎగ్గొటిందని ఆయన ఆరోపించారు. తక్షణమే రైతులకు ఇవ్వాల్సిన రైతు భరోసా ఇవ్వాలని లేక పోతే రైతులు ప్రభుత్వానికి , ముఖ్యమంత్రికి తగిన బుద్ధి చెపుతారని ఆయన హెచ్చరించారు.

## రంగు ముత్యంరాజు గురుస్వామికి గౌరవ డాక్టరేట్

### ఈ నెల 27న తమిళనాడు హోసూర్‌లో ప్రదానం

శాలిగౌరారం : నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఊట్కూరు గ్రామానికి చెందిన ఆధ్యాత్మిక, సామాజిక సేవకులు, ఉద్యాన విస్తరణ అధికారి రంగు ముత్యంరాజు గురుస్వామి గౌరవ డాక్టరేట్‌కు ఎంపికయ్యారు. ఆసియా అంతర్జాతీయ సాంస్కృతిక అకాడమీ, ఆసియా అంతర్జాతీయ సాంస్కృతిక పరిశోధన విశ్వవిద్యాలయం యాజమాన్యం ఉద్యానవనం, దైవత్వం, ఆధ్యాత్మికత, సామాజిక సేవ విభాగంలో ఆయనకు ఈ పురస్కారం ప్రదానం చేయనుంది. ఈ నెల 27న తమిళనాడు రాష్ట్రం హోసూర్‌లో జరిగే కార్యక్రమంలో డాక్టరేట్ అందుకోనున్నారు. రంగు ముత్యంరాజు 1977 మే 9న ఊట్కూరులో రైతు దంపతులు రంగు సత్తయ్య గౌడ్, బుచ్చమ్మకు జన్మించారు. చిన్నతనం నుంచే సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ 1994లో నవోదయ యువజన సంఘాన్ని స్థాపించారు. భారత జాతీయ విద్యార్థి సంఘంలో పనిచేశారు. గత 25 ఏళ్లుగా అయ్యప్ప దీక్ష తీసుకుంటూ గురుస్వామిగా భక్తులకు అయ్యప్ప తత్వాన్ని బోధిస్తున్నారు. అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ ద్వారా పేదలకు అన్నదానం, అల్పాహారం పంపిణీ చేస్తున్నారు. గత 16 ఏళ్లుగా ఉద్యాన శాఖలో పనిచేస్తూ రైతులకు సేవలందిస్తున్నారు. 1997 నుంచి జర్నలిస్ట్‌గా కూడా పనిచేస్తున్నారు. ఈ గౌరవాన్ని అందించిన అకాడమీ యాజమాన్యానికి ముత్యంరాజు కృతజ్ఞతలు తెలిపారు.

# ట్రై సిరీస్ ఛాంపియన్ భారత్-ఏ



**శ్రీలంక వేదికగా జరిగిన ట్రై సిరీస్‌ను భారత్ 'ఏ' జట్టు కైవసం**

**ఫైనల్లో శ్రీలంక 'ఏ' జట్టుపై 66 పరుగుల తేడాతో విక్టరీ**

**యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ 29 బంతుల్లో 94 పరుగులతో విధ్వంసం**

**లిస్ట్ ఏ క్రికెట్‌లో 11 బంతుల్లోనే వేగవంతమైన హాఫ్ సెంచరీ రికార్డు**

శ్రీలంక గడ్డపై జరిగిన ట్రై నేషన్ 'ఏ' సిరీస్‌ను భారత్ 'ఏ' జట్టు కైవసం చేసుకుంది. దంబుల్లా వేదికగా ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఆతిథ్య శ్రీలంక 'ఏ' జట్టుపై 66 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ (94; 29 బంతుల్లో 10 ఫోర్లు, 8 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగి భారత భారీ స్కోరుకు బలమైన పునాది వేశాడు. అనంతరం బౌలర్లు కూడా సమష్టిగా రాణించడంతో భారత్ సునాయాసంగా ట్రోఫీని అందుకుంది.

### ఛేదనలో శ్రీలంక పోరాటం

378 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంకకు ఆరంభంలోనే గట్టి దెబ్బ తగిలింది. భారత పేసర్ యశ్ ఠాకూర్ తన తొలి స్పెల్‌లోనే అవిష్క ఫెర్నాండో, నిరోషన్ డిక్వెల్లా, నువనిదు ఫెర్నాండో వంటి కీలక బ్యాటర్లను పెవిలియన్ చేర్చి శ్రీలంక టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చాడు. ఈ దశలో సదీర సమరవిక్రమ (52), వనుజ సహన్ (62) అర్ధ శతకాలతో ఆదుకునే ప్రయత్నం చేశారు. సహన్‌కు తోడు విజయకాంత్ వియస్కాంత్ (39) కూడా వేగంగా ఆడినా, భారత బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీయడంతో శ్రీలంక ఛేదన ఎప్పుడూ లక్ష్యం దిశగా సాగలేదు. చివరకు 47.1 ఓవర్లలో 311 పరుగులకు ఆలౌట్ అయి ఓటమి పాలైంది.

### సూర్యవంశీ విధ్వంసం.. భారత భారీ స్కోరు

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన శ్రీలంక 'ఏ' జట్టు బౌలింగ్ ఎంచుకుంది. అయితే, వారి నిర్ణయం తప్పని భారత ఓపెనర్లు నిరూపించారు. ముఖ్యంగా, యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఆడిన తీరు శ్రీలంక బౌలర్లకు చుక్కలు చూపించింది. కేవలం 11 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసి లిస్ట్ ఏ క్రికెట్‌లో వేగవంతమైన అర్ధ శతకం నమోదు చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు.

ప్రియాంశ్ ఆర్య (39)తో కలిసి తొలి వికెట్‌కు కేవలం 8.5 ఓవర్లలోనే 132 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. శతకానికి కేవలం 6 పరుగుల దూరంలో సూర్యవంశీ ఔటయ్యాడు. అనంతరం కెప్టెన్ తిలక్ వర్మ (67), రుతురాజ్ గైక్వాడ్ (40), కుమార్ కుశాగ్ర (36) రాణించారు. చివర్లో అనుకుల్ రాయ్ (39; 15 బంతుల్లో) మెరుపులు మెరిపించడంతో భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 377 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది.

### ఆల్రౌండ్ ప్రదర్శనతో భారత్ విజయం

బ్యాటింగ్‌లో సూర్యవంశీ విధ్వంసానికి తోడు, బౌలర్లు కూడా రాణించడంతో భారత్‌కు విజయం సులువైంది. శ్రీలంక పతనాన్ని శాసించిన యశ్ ఠాకూర్, విప్రాజ్ నిగమ్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అనుకుల్ రాయ్ రెండు వికెట్లతో రాణించాడు. టోర్నమెంట్‌లో నెమ్మదిగా ప్రారంభించినప్పటికీ, తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లు, ఫైనల్లో అద్భుత ప్రదర్శన కనబరిచి భారత్ 'ఏ' జట్టు ఆల్రౌండ్ ప్రదర్శనతో ట్రోఫీని గెలుచుకుంది. ఈ విజయంతో భారత యువ ఆటగాళ్లు తమ సత్తా చాటారు. తన అద్భుత బ్యాటింగ్ తో అలరించిన చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశీ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా ఎంపికయ్యాడు.

# 21 ఏళ్ల రికార్డు బద్దలు కొట్టిన వైభవ్

భారత క్రికెట్‌లో ఓ కొత్త సంచలనం ఆవిర్భవించింది. కేవలం 15 ఏళ్ల వయసులోనే ఓ యువ కెరటం అంతర్జాతీయ స్థాయి బౌలింగ్‌ను చీల్చి చెండాడుతూ ప్రపంచ రికార్డులను తిరగరాశాడు. శ్రీలంకలోని దంబుల్లా వేదికగా జరుగుతున్న ట్రై-నేషన్ సిరీస్ ఫైనల్‌లో శ్రీలంక-ఏ జట్టుపై భారత యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు. ఈ మ్యాచ్‌లో అతను కేవలం 11 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసి, లిస్ట్-ఏ క్రికెట్‌లో సరికొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. మ్యాచ్ ప్రారంభమైన తొలి ఓవర్ ఐదో బంతికే ఫోర్‌తో తన పరుగుల ఖాతా తెరిచిన వైభవ్, ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు. శ్రీలంక బౌలర్లపై కనికరం లేకుండా విరుచుకుపడ్డాడు. ఎదుర్కొన్న ప్రతీ బంతిని బౌండరీకి తరలించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు కనిపించాడు. ఈ క్రమంలో కేవలం 11 బంతుల్లోనే 5 ఫోర్లు, 5 సిక్సర్లతో హాఫ్ సెంచరీ మార్కును అందుకున్నాడు. దీంతో 2005లో శ్రీలంక ఆటగాడు కౌశల్య వీరరత్నే 12 బంతుల్లో నెలకొల్పిన ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ రికార్డు బద్దలైంది. 21 ఏళ్ల పాటు పదిలంగా ఉన్న ఈ రికార్డును వైభవ్ తుడిచిపెట్టేశాడు. లీగ్ దశలో పెద్దగా రాణించలేకపోయిన వైభవ్, ఫైనల్ మ్యాచ్‌లో మాత్రం తన విశ్వరూపం ప్రదర్శించాడు. ఆరంభంలో పేసర్లను లక్ష్యంగా చేసుకుని లెగ్ సైడ్ బౌండరీలు బాదిన అతను, ఫీల్డింగ్ మార్పుల తర్వాత ఎక్స్‌ట్రా కవర్ మీదుగా బంతిని బౌండరీ దాటించాడు. మంచి బంతులను కూడా అలవోకగా సిక్సర్లుగా మలచడం అతని బ్యాటింగ్ నైపుణ్యానికి నిదర్శనం. ముఖ్యంగా ఎక్స్‌ట్రా కవర్ మీదుగా అతను బాదిన మూడు సిక్సర్లు ఇన్నింగ్స్‌కే హైలైట్‌గా నిలిచాయి. ఈ మెరుపు ఇన్నింగ్స్‌తో లిస్ట్-ఏ క్రికెట్‌లో ఫాస్టెస్ట్ సెంచరీ (29 బంతుల్లో జేక్ (ఫ్రేజర్-మెక్‌గర్క్ రికార్డు) సమం చేసేలా కనిపించాడు. అయితే, సెంచరీకి కేవలం ఆరు పరుగుల దూరంలో ఇన్నింగ్స్ 9వ ఓవర్లో మిడ్-ఆఫ్ వద్ద క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అప్పటికే అతను 29 బంతుల్లో 10 ఫోర్లు, 8 భారీ సిక్సర్లతో 94 పరుగులు చేసి జట్టుకు బలమైన పునాది వేశాడు. సెంచరీ చేజారినప్పటికీ ఈ 15 ఏళ్ల కుర్రాడి అసాధారణ ప్రదర్శన యావత్ క్రికెట్ ప్రపంచాన్ని అబ్బురపరిచింది.



# టీ20 క్రికెట్‌లో కొత్త రారాజు

## గేల్‌ను అధిగమించిన పొలార్డ్

వెస్టిండీస్ విధ్వంసకర ఆల్‌రౌండర్ కీరన్ పొలార్డ్ టీ20 క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఈ పొట్టి ఫార్మాట్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఇప్పటివరకు ఈ రికార్డును తన పేరిట ఉంచుకున్న సహచర ఆటగాడు క్రిస్ గేల్‌ను పొలార్డ్ అధిగమించాడు. మేజర్ లీగ్ క్రికెట్ (మీజ) 2026 సీజన్‌లో భాగంగా ఆదివారం ఈ ఘనత సాధించాడు. డల్లాస్‌లో వాషింగ్టన్ ఫ్రీడమ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఎంఐ న్యూయార్క్ తరఫున ఆడిన పొలార్డ్, అజేయ శతకంతో (100లి పరుగులు, 56 బంతుల్లో) చెలరేగాడు. ఈ ఇన్నింగ్స్‌తో అతను టీ20ల్లో తన మొత్తం పరుగుల సంఖ్యను 14,582కు పెంచుకున్నాడు. దీంతో, 14,562 పరుగులతో పదేళ్లకు పైగా (4,463 రోజులు) అగ్రస్థానంలో ఉన్న క్రిస్ గేల్ రికార్డు బద్దలైంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన వాషింగ్టన్ ఫ్రీడమ్ జట్టు 245 పరుగులు చేయగా, పొలార్డ్ సెంచరీ చేసినప్పటికీ ఎంఐ న్యూయార్క్ 215 పరుగులకే పరిమితమై ఓటమిపాలైంది. 39 ఏళ్ల పొలార్డ్ తన సుదీర్ఘ కెరీర్‌లో 736 టీ20 మ్యాచ్‌లు ఆడి ఈ మైలురాయిని చేరుకున్నాడు. టీ20 క్రికెట్‌లో 10,000కు పైగా పరుగులు, 300కు పైగా వికెట్లు పడగొట్టిన ఏకైక ఆటగాడిగానూ అతనికి అరుదైన రికార్డు ఉంది. ఎక్కువగా ఫినిషర్ పాత్ర పోషించే అతను, నెం.5 లేదా ఆ తర్వాతి స్థానాల్లో బ్యాటింగ్‌కు వచ్చి 10,000కు పైగా పరుగులు చేయడం విశేషం. ఈ వయసులోనూ అత్యున్నత స్థాయిలో రాణిస్తూ పొలార్డ్ తన ప్రత్యేకతను చాటుకుంటున్నాడు.

### టీ20 క్రికెట్‌లో పరుగుల వీరులు వీళ్లే..

కీరన్ పొలార్డ్: 14,582 పరుగులు (736 మ్యాచ్‌లు)
క్రిస్ గేల్: 14,562 పరుగులు (463 మ్యాచ్‌లు)
అలెక్స్ హెల్స్: 14,449 పరుగులు (528 మ్యాచ్‌లు)
జాస్ బట్లర్: 14,371 పరుగులు (510 మ్యాచ్‌లు)
డేవిడ్ వార్నర్: 14,284 పరుగులు (439 మ్యాచ్‌లు)
విరాట్ కోహ్లీ: 14,218 పరుగులు (430 మ్యాచ్‌లు)



# కోహ్లీ, బుమ్రా రీఎంట్రీ

## ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్: భారత జట్టు ప్రకటన..

ఇంగ్లండ్‌తో జరగనున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) 15 మంది సభ్యులతో కూడిన జట్టును ఆదివారం ప్రకటించింది. సీనియర్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, పేస్ గుర్రం జస్ప్రీత్ బుమ్రా జట్టులోకి పునరాగమనం చేశారు. జూలై 14న ప్రారంభం కానున్న ఈ పర్యటనకు శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా, శ్రేయస్ అయ్యర్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించారు. ఐపీఎల్ 2026 సందర్భంగా కండరాల గాయంతో బాధపడిన విరాట్ కోహ్లీ, ఇటీవలే ముగిసిన అఫ్ఘనిస్థాన్ సిరీస్‌కు దూరమైన విషయం తెలిసిందే. అయితే, అతను పూర్తి ఫిట్‌నెస్ నిరూపించుకున్న తర్వాతే తుది జట్టులో ఆడతాడని బీసీసీఐ స్పష్టం చేసింది. ఇక, పనిభారం కారణంగా అఫ్ఘనిస్థాన్ సిరీస్‌కు విశ్రాంతి తీసుకున్న జస్ప్రీత్ బుమ్రా కూడా తిరిగి జట్టులోకి వచ్చాడు. ఇంగ్లండ్ పరిస్థితుల్లో భారత పేస్ దాడికి అతడు నాయకత్వం వహించనున్నాడు. అఫ్ఘనిస్థాన్‌పై చివరి వన్డేలో సెంచరీతో అదరగొట్టిన యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌పై సెలక్టర్లు వేటు వేశారు. కోహ్లీ రాకతో అతడికి చోటు దక్కలేదు. మరోవైపు, సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఈ సిరీస్‌కు కూడా ఎంపిక కాలేదు. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో గాయం నుంచి కోలుకుంటున్న క్రమంలో అతను ఇంకా పూర్తి ఫిట్‌నెస్ సాధించలేదని తెలుస్తోంది. గత సిరీస్‌లో ఆకట్టుకున్న లెఫ్ట్ ఆర్మ్ పేసర్ గుర్నూర్ బ్రార్ తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. ఇంగ్లండ్‌లో భారత పర్యటన జూలై 14న ఎడ్జ్‌బాస్టన్‌లో తొలి వన్డేతో ప్రారంభమవుతుంది. రెండో వన్డే జూలై 16న సోఫియా గార్డెన్స్‌లో, మూడో వన్డే జూలై 19న చారిత్రక లార్డ్స్ మైదానంలో జరగనుంది.

### ఐర్లాండ్ సిరీస్‌కు వరుణ్ చక్రవర్తి దూరం

ఇదిలా ఉండగా, స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఐర్లాండ్‌తో జరగనున్న టీ20 సిరీస్‌కు దూరమైనట్లు బీసీసీఐ ధ్రువీకరించింది. ఐపీఎల్ 2026లో ఎడమ కాలికి గాయపడిన అతను ప్రస్తుతం కోలుకుంటున్నాడని, పునరావాసం చివరి దశలో ఉందని బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. భారత్, ఐర్లాండ్ మధ్య టీ20 సిరీస్ జూన్ 26 నుంచి జరగనుంది.

### ఇంగ్లండ్ పర్యటనకు భారత వన్డే జట్టు:

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్ (వైస్-కెప్టెన్), కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్, నితీశ్ కుమార్ రెడ్డి, కుల్దీప్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, గురనూర్ బ్రార్.

(లిఫిట్‌నెస్ నిరూపించుకోవాల్సి ఉంటుంది)



### ఐర్లాండ్‌తో టీ20 సిరీస్‌కు భారత జట్టు (సవరించిన):

శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), శివమ్ దూబే, తిలక్ వర్మ (వైస్-కెప్టెన్), నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, వైభవ్ సూర్యవంశీ, ప్రసిద్ధ్ కృష్ణ.




# రావిపూడి.. నువ్వు వేరే లెవల్ బాబు

దర్శకుడు అనిల్ రావిపూడి సినిమాలు తీయడంలోనే కాదు ప్రమోషన్స్ చేయడంలో కూడా తనదైన స్టైల్ చూపిస్తారు. కేవలం ఎంటర్టైన్మెంట్ తో సినిమాను తెరకెక్కించడమే కాకుండా దాన్ని మొదట్నుంచి జనాల్లోకి తీసుకెళ్లడానికి ఫన్నీ స్కిట్స్ డిజైన్ చేస్తారు. లేటెస్ట్ గా వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ కాంబినేషన్లో వస్తున్న మల్టీస్టారర్ సినిమాకు సంబంధించిన ఓపెనింగ్ రోజు కూడా ఇలాంటి ఫన్నీ వీడియోతోనే నవ్వించారు. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో వెంకటేష్, కళ్యాణ్ రామ్ లు బావ బామ్మర్దులుగా నటిస్తున్నారు. వెంకీకి జోడీగా కీర్తి సురేష్ నటిస్తుండగా, కళ్యాణ్ రామ్ కు జంటగా కృతి శెట్టి నటిస్తున్నారు. ఇలాంటి స్టార్ కాస్ట్ తో సినిమా అనౌన్స్ మెంట్ రాగానే ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి ఏర్పడింది. ఇక షూటింగ్ ప్రారంభం సందర్భంగా రిలీజ్ చేసిన వీడియోలో అనిల్ రావిపూడి ఒక కత్తి పట్టుకుని ఫ్యాన్స్ ఇచ్చారు అని ఒక ఐడియా కావాలని హడావుడి చేశాడు. ఇక వెంకీ చేతిలో పెట్టగానే రావిపూడి చెయ్యి కోయడం ఆ తరువాత పోటాపోటీగా కళ్యాణ్ రామ్ హీరోయిన్స్ కూడా కోయడం హైలెట్ అయ్యింది. ఈ సీన్ తో అనిల్ మరోసారి తన మార్క్ కామెడీతో అందరినీ ఆకట్టుకున్నారు. ఈ ఫన్నీ మూమెంట్ తర్వాత డైరెక్టర్ సినిమా బ్యాక్ డ్రాప్ ను రివీల్ చేశారు. ఈ కథ రాయలసీమ నేపథ్యంలో సాగుతుందని చెప్పారు. అయితే రాయలసీమ అనగానే కేవలం ఫ్యాక్షన్, రక్తపాతం మాత్రమే కాకుండా ఫ్యామిలీ బ్యాక్ డ్రాప్ లో నవ్వుల కోలాటంగా ఈ సినిమా ఉండబోతోందని వీడియో ద్వారా క్లారిటీ ఇచ్చేశారు. ఈ సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్ గా జివి ప్రకాష్ కుమార్ పని చేస్తున్నారు. ఆయనను కూడా ఇంతకు ముందు ఒక బీచ్ లో ఇసుకలో పాతిపెట్టిన ఫన్నీ స్కిట్ ద్వారా పరిచయం చేసిన విషయం తెలిసిందే. ఇక ఈ ప్రమోషన్స్ తో నెటిజన్లు కంటెంట్ కింగ్ అని బిరుదులను ఇచ్చేస్తున్నారు. రావిపూడి నువ్వు వేరే లెవెల్ బాబు అంటూ మరికొందరు చెబుతున్నారు.

# మినీ స్కర్ట్‌లో హీట్ పెంచుతున్న దిశాపటానీ..

టాలీవుడ్ డేరింగ్ అండ్ డాషింగ్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో 2015లో డిసెంబర్ 17న ప్రేక్షకుల ముందుకు వచ్చిన చిత్రం లోఫర్. ఈ చిత్రం ద్వారానే దిశా పటానీ తొలిసారి సినీ ఇండస్ట్రీకి పరిచయమైంది. బాలీవుడ్ బ్యూటీ అయినప్పటికీ తన నటన రంగ ప్రవేశాన్ని తెలుగు ద్వారా చేయడం విశేషం. దిశాపటానీ, రేవతి, వరుణ్ తేజ్, పోసాని తదితరులు కీలక పాత్రలు పోషించిన ఈ సినిమా 750కి పైగా స్క్రీన్ లలో విడుదలైనప్పటికీ.. పాజిటివ్ టాక్ సొంతం చేసుకోలేకపోయింది. పైగా మొదటి సినిమానే ఆమెను నిరాశపరిచినా.. ఆ తర్వాత హిందీలోకి అడుగు పెట్టింది. 2016లో ఎంఎస్ ధోని: ది అన్ టోల్డ్ స్టోరీ తో భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. అంతేకాదు ఈ సినిమాతో దిశా పటానీ ఊహించని పాపులారిటీ అందుకుంది. ఇక అక్కడ నుంచి వెను తిరగకుండా పలు సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్న ఈమె.. ఈ మధ్యకాలంలో బాలీవుడ్ లోనే సినిమాలు చేస్తూ ఇటు సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. అందులో భాగంగానే నిత్యం గ్లామర్ ఫోటోషూట్ తో ప్రేక్షకులను ఆకట్టుకునే దిశా పటానీ తాజాగా మరో ట్రెండీ అవుట్ ఫిట్ తో నెటిజన్స్ ముందుకు వచ్చింది. మినీ స్కర్ట్ ధరించి అందాలతో ఆకట్టుకుంది. తాజాగా తన సినిమా ప్రమోషన్ లో భాగంగా పికాంటే జీబ్రా ప్రింట్ హాల్టర్ టాప్ ధరించి.. దీనికి కాంబినేషన్లో బ్లాక్ కలర్ మినీ స్కర్ట్ ధరించి తన అందాలను ఫుల్ ఫీల్ చేసుకుంది ముఖ్యంగా దీనికి సరిపోయేలా సిల్వర్ బ్యాంగిల్స్ , రింగ్స్ ధరించిన ఈమె తన అద్భుతమైన లేటెస్ట్ మినీ స్కర్ట్ తో నెటిజన్స్ ను మెప్పిస్తోంది. మొత్తానికి అయితే తన లేటెస్ట్ ఔట్ఫిట్ తో గ్లామర్ వలకబోస్తూ దిశా పటానీ షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.





## యోగా డే స్పెషల్.. విభిన్నమైన ఫోజులతో మెస్మరైజ్ చేసిన ప్రగ్యా జైస్వాల్!

నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సామాన్యులను మొదలుకొని సెలబ్రిటీల వరకు ప్రతి ఒక్కరు యోగాసనాలతో సోషల్ మీడియాను హోరెత్తిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే పలువురు హీరోయిన్లను మొదలుకొని హీరోల వరకు ఇన్స్టాగ్రామ్ వేదికగా విభిన్నమైన ఫోజులతో ఆడియన్స్ ను ఆకట్టుకుంటున్నారు. ఈ క్రమంలోనే బాలయ్య బ్యూటీగా పేరు సొంతం చేసుకున్న ప్రగ్యా జైస్వాల్ కూడా విభిన్నమైన యోగ ఫోజులతో అందరి దృష్టిని ఆకట్టుకుంది. మరి ఆమె షేర్ చేసిన ఫోటోల గురించి ఇప్పుడు చూద్దాం.. ప్రగ్యా జైస్వాల్ యోగాసనాలలో భాగంగా మూన్ ఫోజ్, హాఫ్ మంకీ ఫోజ్ అంటూ ఇలా పలు ఆసనాలు వేసి అందరి దృష్టిని ఆకట్టుకుంది. పైగా ఈ ఆసనాలకు సంబంధించిన ఫోటోలను షేర్ చేస్తూ ఒక క్యాప్షన్ కూడా జోడించింది. “నిజమైన ఆరోగ్యం అంటే కాలాన్ని వెనక్కి తిప్పడం కాదు.. అది సౌందర్యంతో ముందుకు సాగడం... మీ శరీరంతో అనుసంధానమై ఉండడం.. అలాగే ప్రతిరోజు మీకోసం మీరు ఒక సమయాన్ని కేటాయించుకోవడం.. అని యోగ నాకు నేర్పింది. ఎందుకంటే ఆరోగ్యకరమైన వృద్ధాప్యం అంటే జీవితానికి సంవత్సరాలు జోడించడం కాదు.. అది మీ సంవత్సరాలకు జీవాన్ని జోడించడం.. అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు” అంటూ యోగ డే సందర్భంగా స్పెషల్ ఫోజులతో అందరినీ ఆకట్టుకుంది ప్రగ్యా జైస్వాల్ . ప్రస్తుతం ఈమె ఇచ్చిన ఫోజులు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి.

# ఇది కదా సామ్ అసలైన స్టామినా..



ఒక సినిమా హిట్ అవ్వొచ్చు.. రెండు సినిమాలు సక్సెస్ కావొచ్చు. కానీ ఏళ్లు గడిచినా, కొత్త హీరోయిన్లు వచ్చినా, ఓవర్సీస్ మార్కెట్ లో తన డామినేషన్ ను అలాగే కొనసాగించడం మాత్రం అందరి వల్ల కాదు. అదే పని చేసి చూపిస్తున్నారు స్టార్ హీరోయిన్ సమంత. తాజాగా మా ఇంటి బంగారం మూవీతో మరోసారి బాక్సాఫీస్ వద్ద తన స్టామినా ఏంటో ప్రూవ్ చేసుకున్న సామ్.. ఇప్పుడు అమెరికా మార్కెట్ లో ఓ అరుదైన రికార్డుకు మరింత దగ్గరయ్యారు.

సమంత లీడ్ రోల్ లో నటించిన లేటెస్ట్ మూవీ మా ఇంటి బంగారం మంచి రెస్పాన్స్ అందుకుంటోంది. దర్శకురాలు నందిని రెడ్డి తెరకెక్కించిన ఆ చిత్రం విడుదలైన తొలి రోజు నుంచే పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్ లో కూడా ఆ సినిమాకు మంచి వసూళ్లు వస్తుండటంతో మేకర్స్ హ్యాపీ మోడ్ లో ఉన్నారు. అయితే ఆ సినిమా సక్సెస్ తోపాటు ఇప్పుడు మరో విషయం సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది. ఇప్పటికే అమెరికా బాక్సాఫీస్ వద్ద 1 మిలియన్ డాలర్లకు పైగా వసూళ్లు సాధించిన అత్యధిక చిత్రాలు కలిగిన హీరోయిన్ గా సమంత రికార్డు సృష్టించారు. ఆమె నటించిన 16 సినిమాలు ఆ ఘనతను అందుకున్నాయి. ఇప్పుడు మా ఇంటి బంగారం త్వరలోనే 1 మిలియన్ డాలర్ క్లబ్ లో చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. వీకెండ్ ముగిసే టైమ్ కు ఆ మార్క్ ను అందుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. అదే జరిగితే అమెరికా మార్కెట్ లో 17 మిలియన్ డాలర్ చిత్రాలు కలిగిన తొలి సౌత్ ఇండియన్ హీరోయిన్ గా సమంత మరో క్రేజీ రికార్డును తన పేరిట నమోదు చేసుకోనున్నారు. ప్రస్తుతం ఉన్న హీరోయిన్లలో ఆ రేంజ్ ఓవర్సీస్ ట్రాక్ రికార్డు చాలా అరుదని సినీ ఎక్స్పర్ట్స్ చెబుతున్నారు.

Printed, Published and Owned by : GUNDAGONI LINGAIAH and Printed at MANASA PRINTERS, H.No. 7-848/3,Srinagar Colony,Panagal Road,Nalgonda-508001 . and Published at Manasa Publication H.No. 7-848/3,Srinagar Colony,Panagal Road,Nalgonda-508001. Editor: GUNDAGONI LINGAIAH RNI.No. TELTEL/2013/58044. Cell : 9848457689. gundagoni@gmail.com CEO: KANDHULA VENKATARAMANA